శనివారం
20-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 60
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బీజేపీ గెలుపు తేలిక కాదు

- కనిపించే దానికన్నా కాషాయ పార్టీ మరింత బలహీనం
- ఆర్థిక సంక్షోభం, బీహార్ పరిణామాలే కారణం
- విపక్షాలు కలిసి పని చేస్తే సులభ విజయం
- రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం

న్యూదిల్లీ: దేశంలో ఆర్థిక సంక్షోభం, బీహార్ రాజకీయ పరిణామాలు, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన పరిస్థితి 2024 ఎన్నికల్లో బీజేపీని మరింత బలహీనపరుస్తాయని రాజకీయ విశ్లేషకులు స్పష్టంచేస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు అంత తేలిక కాదని అంటున్నారు. ఆ పార్టీ కేవలం 240 సీట్లకే పరిమితమవుతుందని అంచనా వేశారు. '2024 జాతీయ ఎన్నికలు భారతీయ జనతా పార్టీ ఓడిపోయే ఎన్నికలలా కనిపిస్తున్నాయి. బీజేపీ కనిపించే దానికంటే చాలా బలహీనంగా ఉంది. ఆ పార్టీ సీట్ల సంఖ్య 240ని దాటి 272 స్థానాలకు చేరడమనేది చూడటం కష్టం' అని సామాజిక ఉద్యమనేత, రాజకీయ పరిశీలకుడు యోగేంద్ర యాదవ్ అంటున్నారు. 'ది వైర్' కోసం కరణ్ థాపర్‌తో ఆయన 35 నిమిషాల ఇంటర్వ్యూ

- మిగతా 2 లో

ముఖ హాజరు మంటలు

- నాలుగు రోజులు ఆలస్యమైతే అర్ధసెలవు
- ఉపాధ్యాయులపై అధికారుల ఒత్తిళ్లు
- ఇప్పటికి లక్ష మంది డౌన్‌లోడ్
- అన్ని విభాగాల ఉద్యోగులకూ విస్తరణ
- జగన్ సర్కారుపై నిరసన గళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ త్వరలో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్సు (ముఖ గుర్తింపు హాజరు) వ్యవస్థను తీసుకురావాలనే నిర్ణయంపై ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు భగ్గుమంటున్నాయి. తొలుత ఉపాధ్యాయులకే పరిమితమని ప్రభుత్వం ప్రకటించి, మొత్తం ఉద్యోగ రంగానికి విస్తరిస్తామంటూ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన ప్రకటనపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలు సైతం ప్రభుత్వ వైఖరిని ఎండగడుతున్నాయి. గతంలో ఉన్న బయోమెట్రిక్ విధానాన్ని పక్కనపెట్టి, ప్రభుత్వం ఉద్యోగుల సెల్‌ఫోన్లతోనే, సెల్ఫీ వీడియోలతో బయోమెట్రిక్ విధానానికి శ్రీకారం చుట్టడాన్ని తప్పుపడుతున్నారు. ఇది ఒక్క ఉపాధ్యాయులకే కాదనీ, అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగులకూ వర్తింపజేస్తామని ఇటీవల జరిగిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించడంతో కలకలం రేగుతోంది.

ఉపాధ్యాయుల పై అధికారుల ఒత్తిళ్లు!

ముఖ గుర్తింపు హాజరు నిమిత్తం ప్రభుత్వం రూపొందించుకున్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ, ఉపాధ్యాయుల పై విద్యాశాఖాధికారులు ఒత్తిళ్లు ప్రారంభించారు. రాష్ట్రంలో 1.83 లక్షల మంది ఉపాధ్యాయులు ఉంటే, ఇంతవరకు దాదాపుగా లక్ష మంది యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ హాజరు యాప్ విషయంలో ఉపాధ్యాయులు ఎంతమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీఎం జగన్ నాయకత్వంలోని ఈ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని చెబుతూనే, మరోవైపు వారిపై ఒత్తిళ్లు చేయడం పై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మూడు సార్లకు మించి, నాలుగోసారి ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులకు అర్ధ రోజు సెలవుగా కింద పరిగణించాలనే నిబంధన విధించారు. యాప్‌ను వినియోగ నిమిత్తం 15 రోజులపాటు శిక్షణ కాలంగా పరిగణిస్తారు.

యాప్‌తో సాంకేతిక సమస్యలు

ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం రూపొందించిన ముఖ గుర్తింపు యాప్‌తో నిత్యం సాంకేతిక సమస్యలు ఎదురయ్యే పరిస్థితులున్నాయి. ఆయా పాఠశాలల్లో సాంకేతిక సమస్యలను ఎవరు పరిష్కరిస్తారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఒక వైపు బోధనా పనులు, మరోవైపు ప్రభుత్వ సంక్షేమ

- మిగతా 2 లో

భూ పోరాట యోధుడు చండ్ర

సీపీఐ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసిన కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు కృష్ణాజిల్లా చల్లపల్లి జమీందారు ఆగడాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ప్రధాన పాత్ర వహించారు. 1942లో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రైతాంగ పోరాటం ప్రారంభమైంది. చల్లపల్లి సంస్థానానికి చిట్టచివరి వారసత్వ జమీందారు యార్లగడ్డ శివరామప్రసాదు (1903- 1976)కు వ్యతిరేకంగా ఉధృత పోరాటం జరిగింది. జమీందారు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా కూడా పనిచేశారు. 1942 సంవత్సరం జులైలో మంగళాపురం గ్రామాలలో చాలాకాలం నుండి బంజరు భూమి సాగు చేసుకుంటున్న ముదిరాజు కూలీలను తొలగించడానికి జమీందారు పూనుకున్నాడు. అంతకుముందులా రౌడీలను పంపి దౌర్జన్యం చేయడానికి సాహసించలేక పోలీసుల సహాయంతో ఆ భూములలోకి కూలీలు వెళ్లకుండా 144 సెక్షన్ విధించారు. ఈ పోరాటంలో కూలీలకు అండగా రైతు- కూలీ నాయకులైన చండ్ర రాజేశ్వరరావు, చల్లపల్లి నారాయణరావు, గుంటూరు బాపనయ్య మొదలైన వారు నిలబడ్డారు. 144 సెక్షన్‌ను ధిక్కరించి, వీరిని తొలగించడానికి ధైర్యం చాలక ఆ రోజుల్లో కర్కోటకుడిగా పేరుగాంచిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నీలి వెంకటేశ్వరనాయుడు తుపాకులతో జమీందారులు ఇచ్చిన గుర్రాలపై వెళ్లి పాశవికంగా లాఠీచార్జీ చేశాడు. చండ్ర రాజేశ్వరరావు, బాపనయ్య, నారాయణరావు తదితరులు విపరీతమైన దెబ్బలకు గురయ్యారు. ఈ ఘటన తాలూకాలోని రైతు- కూలీలను ఎంతో ఆగ్రహానికి గురి చేసింది.

ఈ సందర్భంలో పెట్టిన అనేక కేసుల్లో అవనిగడ్డ, బందరు కోర్టులకు రాజేశ్వరరావు, నారాయణరావులతో సహా ముద్దాయిలందరూ అన్నం మూటలు కట్టుకొని, నడచి వాయిదాలకు ఊరేగింపుగా ఎర్రజెండాలతో రైతుకూలీ పాటలు పాడుకుంటూ వెళ్తుండడం తోవలో ఉన్న ఆయా గ్రామాల ప్రజలను ఎంతో ఉత్తేజపరిచింది. చాలా వాయిదాలకు తిప్పిన తరువాత ఈ కేసులలో రాజేశ్వరరావు, నారాయణరావు, బాపనయ్యలతో పాటు కూలీలకు 3 నుంచి 6 నెలల వరకు కోర్టు శిక్ష విధించింది. ఇందుకు తాత్కాలికంగా జమీందారు సంతోషించినా, తరువాత జరిగిన మహోన్నత జమీందారీ రద్దు పోరాటానికి ఈ ఘటన నాంది పలికింది. 1946లో జమీందారుకు చెందిన ఇళ్ల స్థలాలకు ఉపయోగపడే 17 వేల ఎకరాల భూములను పేదలు ఆక్రమించుకునేందుకు ఆయన స్ఫూర్తి నిచ్చారు. అలాగే జమీందారుకు చెందిన 3 వేల ఎకరాల చెరకు తోటలను భూమిలేని పేదలు, వ్యవసాయ కార్మికులు ఆక్రమించుకున్న పోరాటానికి చండ్ర రాజేశ్వరరావు నాయకత్వం వహించారు. ఈ పోరాటం బ్రహ్మాండంగా విజయవంతమైంది. 1984లో రాజేశ్వరరావు ప్రత్యక్ష నాయకత్వంలో చల్లపల్లి సుగర్స్ భూముల పంపిణీ కోసం ముమ్మర పోరాటం జరిగింది. అనేక గ్రామాలు తిరిగి ఆయన ప్రజలను పోరాటానికి సమాయత్తం చేశారు. ఫలితంగా 3 వేల ఎకరాలకు పైగా భూమిని వ్యవసాయ కార్మికులకు పంపిణీ చేశారు.

నేడు సుప్రీం సీజే నూతలపాటి రాక

- విజయవాడలో కోర్టుల భవనం ప్రారంభం
- రమణకు ఏఎన్‌యూ గౌరవ డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడలో నూతనంగా నిర్మించిన కోర్టుల నూతన భవన సముదాయాన్ని శనివారం ఉదయం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకట రమణ ప్రారంభించనున్నారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.కె.మిశ్రా, వివిధ శాఖల మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొననున్నారు. దీంతో ట్రాఫిక్ మళ్లింపుతో పాటు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోర్టుల భవన సముదాయం ప్రారంభోత్సవం అనంతరం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 37, 38వ స్నాతకోత్సవంలో సుప్రీం సీజే ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఈ సందర్భంగా నూతలపాటికి ఏఎన్‌యూ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనుంది. వెంకట రమణ నాగార్జున యూనివర్సిటీ పూర్వ విద్యార్థి కావడం గమనార్హం. ఈ కార్యక్రమానికి కులపతి హోదాలో రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కూడా హాజరుకానున్నారు.

సుగర్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

ఇద్దరి మృతి-9 మందికి గాయాలు

విశాలాంధ్ర- కాకినాడ రూరల్: కాకినాడ జిల్లాలోని కాకినాడ రూరల్ పరిధి వాకలపూడి పారిశ్రామిక ప్రాంతంలోని 'ప్యారీ సుగర్స్' రిఫైనరీలో శుక్రవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా 9 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. విద్యుదాఘాతం కారణంగా పేలుడు సంభవించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. గోదాంలో చక్కెర బస్తాలు లోడు చేయడానికి కన్వేయర్ బెల్టుకు విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా ఒక్కసారిగా పేలుడు జరిగింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా..మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. మృతులను ఉప్పాడ కొత్తపల్లి మండలం కొండివరం గ్రామానికి చెందిన రాయుడు వీర వెంకట సత్యనారాయణ(36), సామర్లకోట మండలం వేటలపాలెం గ్రామానికి చెందిన వీరమల్ల రాజేశ్వరరావు(45)గా గుర్తించారు. పిఠాపురం మండలం చంద్రాడ గ్రామానికి చెందిన బండి వీరవెంకట రమణ(29) పరిస్థితి విషమంగా ఉంది. అతను కాకినాడలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన 8 మంది కాకినాడలోని

- మిగతా 2 లో

ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ షెడ్యూలు

- 22 నుంచి ఫీజు చెల్లింపు ప్రారంభం
- 23 నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్)-2022 ప్రవేశాల కౌన్సెలింగ్‌కు రాష్ట్ర సాంకేతిక విద్యామండలి షెడ్యూలు జారీజేసింది. తొలుత ఎంపీసీ విభాగానికి ఈనెల 22 నుంచి సెప్టెంబరు 3 వరకు వెబ్ కౌన్సిలింగ్ షెడ్యూలు విడుదల చేశారు. 2022-23 విద్యా సంవత్సరానికిగాను బీఇ/బి.టెక్/ఫార్మసీ కోర్సుల్లో చేరేందుకుగాను, ఏపీ ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులంతా కౌన్సెలింగ్‌లో దరఖాస్తు చేసేందుకు అర్హులు. కౌన్సెలింగ్‌లో అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకుగాను రాష్ట్ర

- మిగతా 2 లో

ఐఆర్‌సీటీసీ కుయుక్తి?

- వెయ్యికోట్ల ఆదాయానికి ప్రణాళిక
- ప్రయాణికుల డేటాపై నీలినీడలు
- డేటా దుర్వినియోగంపై ఐఎఫ్‌ఎఫ్ ఆందోళన

న్యూదిల్లీ: రైల్వే టికెటింగ్‌లో ఏకఛత్రాధిపత్యం కలిగి ఉన్న ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) కొత్త ప్రణాళికతో ముందుకొచ్చింది. ప్రయాణికుల వివరాలతో కూడిన డిజిటల్ డేటాను మానిటైజ్ చేయాలని భావిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటురంగ కంపెనీలతో ఈ మేరకు వ్యాపారం చేయాలని చూస్తోంది. దీని ద్వారా దాదాపు రూ.1000 కోట్ల ఆదాయం రావచ్చని అంచనావేస్తోంది. ఇందుకోసం ఓ కన్సల్టెంట్‌ను నియమించుకునేందుకు తాజాగా టెండర్‌ను ఆహ్వానించింది. ఈ వార్త బయటకు రావడంతో శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో కంపెనీ షేరు విలువ 4 శాతం మేర పెరగడం గమనార్హం. ఇదే సమయంలో ప్రయాణికుల వ్యక్తిగత డేటా గోప్యతపై ఆందోళన వ్యక్తమవుతోంది. దేశంలో ఐఆర్‌సీటీసీ ఒక్కటే రైల్వే టికెట్లను విక్రయిస్తోంది. దాదాపు 80 శాతం టికెట్లు ఐఆర్‌సీటీసీ వేదికగా ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. దీంతో పెద్ద ఎత్తున ప్రయాణికుల వివరాలతో పాటు, వారి లావాదేవీల వివరాలు ఐఆర్‌సీటీసీ వద్ద నిక్షిప్తమై ఉన్నాయి. ఈ డిజిటల్ ఆస్తులను వినియోగించుకుని అదనపు ఆదాయం సమకూర్చుకొనేందుకు తాజాగా ఈ-టెండర్‌ను ఆహ్వానించింది. ఈ టెండర్

- మిగతా 2 లో

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

సర్టిఫికెట్లు ఆపొద్దంటూ ఇంటర్‌బోర్డు కీలక ఆదేశాలు

అంబర్‌పేట పరిధిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో దారుణం చోటు చేసుకుంది. టీసీ గురించి మాట్లాడదామని ప్రిన్సిపల్ గదికి వెళ్లిన ఓ విద్యార్థి నాయకుడు తనతోపాటు తెచ్చుకున్న పెట్రోల్ మీద పోసుకున్నాడు. పక్కనే దీపం ఉండటంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి.

2 లో

చిక్కుల్లో సిసోడియా



- మద్యం కుంభకోణం కేసులో సీబీఐ కేసు
- మరో 14మందిపైనా ఎఫ్ఐఆర్
- మంత్రి సహచరుడికి మద్యం వ్యాపారి రూ.కోటి చెల్లింపు

న్యూదిల్లీ: దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా చిక్కుల్లో పడ్డారు. మద్యం విధానం కుంభకోణం కేసులో సిసోడియాపై సీబీఐ శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆయనతో పాటు మొత్తం 15మందిపై కేసు బనాయించింది. సిసోడియా సహచరుడు నిర్వహిస్తున్న కంపెనీకి ఒక మద్యం వ్యాపారి కోటి రూపాయలు చెల్లించారని, 2021-22 మద్యం విధానాన్ని రూపొందించి అమలు చేయడంలో అవినీతి జరిగిందని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. సెంట్రల్ దిల్లీలోని సిసోడియా అధికారిక నివాసంతో పాటు ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 20 చోట్ల శుక్రవారం దాడులు నిర్వహించిన

- మిగతా 2 లో

అవి పేదల హక్కు.. ఉచితాలు కాదు

ప్రముఖ ఆర్థికవేత్త జయతీ ఘోష్



న్యూదిల్లీ: పౌష్టికాహారం, విద్య, ఆరోగ్యం, నివాసం వంటి పౌరుల కనీస అవసరాలు తీర్చడం ప్రభుత్వాల బాధ్యత అని ప్రముఖ ఆర్థికవేత్త జయతీ ఘోష్ అన్నారు. వీటిని ఉచిత తాయిలాలుగా పరిగణించొద్దని వ్యాఖ్యానించారు. వీటిని పొందడం పేద ప్రజల హక్కు అని స్పష్టంచేశారు. భారత్‌లో పెద్ద ఎత్తున పేదరికం ఉందని జయతీ ఘోష్ తెలిపారు. సరైన విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, నివాసం.. వంటి కనీస అవసరాలు అందించడంలో భారత్ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయిందని ఆవేదన వెలిబుచ్చారు. ఇతర దేశాల్లో కనీస అవసరాలు తీర్చే నాణ్యమైన వస్తువులు, సేవల్ని అందించడం ప్రభుత్వ కనీస బాధ్యతగా భావిస్తారని, ఉచితాలుగా పరిగణించరని తెలిపారు. భారత పన్నుల వ్యవస్థలో పరోక్ష పన్నులదే సింహభాగమని ఆమె తెలిపారు. దీనివల్ల మన దేశంలో ధనవంతుల కంటే పేదలే ఎక్కువ మొత్తంలో పన్నులు చెల్లించాల్సి వస్తోందని వివరించారు. అందువల్ల వారికి కనీస అవసరాలు పొందే హక్కు ఉందన్నారు. ఇటీవల ఉచిత తాయిలాలపై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరుగుతున్న వేళ జయతీఘోష్ స్పందించారు. ఉచితాల వల్ల పన్ను చెల్లింపుదారుల డబ్బు వృథా అవుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల చెప్పుకొచ్చారు. పైగా భారత స్వయంసమృద్ధికి ఇవి అవరోధాలుగా

- మిగతా 2 లో

చైనాకు తిరుగులేదు

బీజింగ్: దేశ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవాలనే చైనా దృఢ సంకల్పాన్ని తక్కువ అంచనావేయవద్దని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్బిన్ అమెరికాను హెచ్చరించారు. అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసి తైవాన్ పర్యటనకు ప్రతిస్పందనగా వాంగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒకే చైనా సూత్రానికి కట్టుబడి ఉన్న చైనా సార్వభౌమాధికారం, ప్రాదేశిక ప్రాదేశిక సమగ్రతను అమెరికా దెబ్బతీసిందని పేర్కొన్నారు. మరోవైపు "తైవాన్ స్వాతంత్ర్యం" వేర్పాటువాద కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడానికి తైవాన్‌కు వెళ్ళిన అమెరికా నాయకులు, అలాస్కా "స్వాతంత్ర్యానికి" మద్దతు ఇవ్వడానికి అమెరికాకు చైనీయులు వెళ్లలేదని అన్నారు. అమెరికా రెచ్చగొట్టే చర్యలకు చైనా దృఢమైన ప్రతిస్పందన సహేతుకమైనది, చట్టబద్ధమైనది, సమర్థనీయమన్నారు. దీనిని అంతర్జాతీయ సమాజం మద్దతునిస్తుందని వాంగ్ చెప్పారు.

జపొరిజియా ప్లాంట్‌ను మూసివేస్తాం: రష్యా

మాస్కో: రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య నెలకొన్న యుద్ధం వల్ల జపొరిజియా అణు కేంద్రం వద్ద పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ప్రస్తుతం ఆ ప్లాంట్ వద్ద ఉక్రెయిన్ ఉద్యోగులు ఉన్నప్పటికీ ఆ కేంద్రం రష్యా సైనికుల నియంత్రణలో ఉంది. ఈ ప్లాంట్‌పై ఉక్రెయిన్‌సేనల దాడులు ఆపకపోతే దాన్ని మూసివేస్తామని రష్యా హెచ్చరికలు జారీ చేసింది. జపొరిజియా న్యూక్లియర్ ప్లాంట్ నుంచి తమ సైన్యాన్ని ఉపసంహరించేది లేదని రష్యా స్పష్టం చేసింది. ఉక్రెయిన్ దాడుల కారణంగా ప్లాంట్ బ్యాక్ అప్ సపోర్ట్ వ్యవస్థలు దెబ్బతిన్నాయని చెప్పారు. ప్లాంట్‌లో ప్రమాదం జరిగితే మాత్రం దానినుంచి వెలువడే రేడియేషన్‌తో జర్మనీ, పోలాండ్, స్లోవేకియా ప్రభావితమవుతాయి. ఒకవేళ మిలటరీని అక్కడ నుంచి తప్పిస్తే అప్పుడు పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుందని రష్యా హెచ్చరికలు జారీ చేశారు. యూరోప్‌లోనే అతిపెద్ద న్యూక్లియర్ ప్లాంట్ అయిన జపొరిజియా అణుకేంద్ర భద్రతపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల అక్కడ కాల్పుల ఘటనలు పెరగడంతో.. ఆ ప్లాంట్ నుంచి ఏక్షణమైనా భారీ స్థాయిలో అణు లీకేజీ జరగనున్నట్లు అనుమానాలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 24వ తేదీన ఉక్రెయిన్‌పై యుద్ధానికి వెళ్లిన రష్యా ఆరంభంలో జపొరిజియా ప్లాంట్‌ను స్వాధీనం చేసుకున్నది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, టర్కీ నేత ఎర్డగోన్‌ను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ కలిశారు. జపొరిజియాకు ఎటువంటి ప్రమాదం జరిగినా అది ఆత్మహత్య అవుతుందని గుటెర్రెస్ వార్నింగ్ ఇచ్చారు. మరో చెర్నోబిల్ జరుగుతుందేమో అన్న భయాందోళనలను టర్కీ అధ్యక్షుడు ఎర్డగోన్ వ్యక్తం చేశారు. రష్యా కావాలనే పవర్ ప్లాంట్ వద్ద కాల్పులు జరుపుతున్నట్లు జెలెన్‌స్కీ ఆరోపించారు. జపొరిజియా నుంచి మిలటరీని తప్పించాలని ఉక్రెయిన్ కుయుక్తులను రష్యా సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇవాన్ చెచయేవ్ ఖండించారు.

అమెరికాలో గాంధీ విగ్రహం ధ్వంసం

వాషింగ్టన్: భారత జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని అమెరికాలో ధ్వంసం చేశారు. న్యూయార్క్ నగరంలో గాంధీ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. తెల్లవారుజామున రెండు కార్లలో వచ్చిన ఆరుగురు వక్తులు శ్రీ తులసి మందిర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహాన్ని పెద్ద సుత్తితో పగులకొట్టి ధ్వంసం చేశారు. అక్కడ ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించగా 25-30 మధ్య వయసున్న ఆరుగురు వ్యక్తులు గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వారు అక్కడి నుంచి కార్లలో పారిపోయినట్లు చెప్పారు. న్యూయార్క్ రిచ్‌మండ్ హిల్స్‌లోని శ్రీ తులసి మందిర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం రెండు వారాల్లో ఇది రెండోసారి. ఈ నెల 3న కూడా దుండగులు అక్కడి గాంధీ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. తాజాగా ఈ నెల 16న ఆ విగ్రహాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు. న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యురాలు జెన్నిఫర్ రాజ్‌కుమార్ ఈ సంఘటనను ఖండించారు. నేరస్థులను త్వరలో పట్టుకుని చట్టం ప్రకారం శిక్ష విధిస్తామని తెలిపారు.

బాలి సదస్సుకు జిన్‌పింగ్, పుతిన్

బాలి : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ బాలిలో జరిగే జి 20 శిఖరాగ్ర సమావేశానికి హాజరు కానున్నట్లు ఇండోనేషియాకు చెందిన జోకోవి తెలిపారు. ఉక్రెయిన్-రష్యాల మధ్య తలెత్తిన తాజా పరిస్థితులు, తైవాన్‌పై తీవ్ర ఉద్రిక్తతల తర్వాత ఇది మొదటి ప్రపంచ శిఖరాగ్ర సమావేశంకానుంది.కోవిడ్ మహమ్మారి ప్రారంభంలో దేశం తన సరిహద్దులను మూసివేసిన జనవరి 2020 తర్వాత జిన్‌పింగ్ చైనా అంతర్జాతీయ సమావేశానికి హాజరుకావడం ఇదే మొదటిసారి. నవంబర్ శిఖరాగ్ర సమావేశానికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా హాజరయ్యే అవకాశం ఉంది. అయితే త్వరలో బైడెన్, జిన్‌పింగ్‌ల మధ్య ముఖాముఖి సమావేశం జరిగే అవకాశం ఉందని నివేదికలు సూచించాయి. రష్యా, ఉక్రెయిన్ నేతలు ఈ సమావేశంలో ముఖాముఖి కలిసే అవకాశం ఉంది. ఈ నేపధ్యంలో శాంతిప్రస్తావన అంశాలు చర్చకు వచ్చే అవకాశంఉంది.

ఐఆర్‌సీటీసీ కుయుక్తి?

(మొదటిపేజీ తరువాయి)

ఆధారంగా మానిటైజ్ ప్రక్రియపై అధ్యయనం చేయడానికి ఓ కన్సల్టెంట్‌ను నియమించుకోనుంది. ఆగస్టు 29న చివరి తేదీగా పేర్కొంది.

డేటాతో ఏం చేస్తారు?

రైల్వే వద్ద పెద్ద ఎత్తున డేటా కలిగి ఉండటంతో అదనపు ఆదాయం సమకూర్చుకోవడానికి అవకాశాలు సైతం అదే స్థాయిలో ఉన్నాయని ఐఆర్‌సీటీసీ భావిస్తోంది. కస్టమర్/వెండర్ అప్లికేషన్ల డేటాను మానిటైజ్ చేయాలనుకుంటున్నట్లు తన టెండర్ నోటీసులో పేర్కొంది. అదనపు ఆదాయం సంపాదించడంతో పాటు సేవలను మరింత మెరుగుపరచడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. ఈ డేటాతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్న టూర్స్ అండ్ ట్రావెల్స్, హోటల్స్, ఫైనాన్సింగ్, ఇన్సూరెన్స్, వైద్య సంస్థలతో వ్యాపారం చేయనున్నట్లు ఐఆర్‌సీటీసీ పేర్కొంది. ఉదాహరణకు క్యాబ్ బుకింగ్ సంస్థలతో ఈ డేటాను పంచుకుంటే.. ప్రయాణికులకు ఆయా సంస్థలు తమ క్యాబ్‌ను బుక్ చేసుకోవాలని నోటిఫికేషన్ పంపించే అవకాశం ఉంటుంది.

మరి గోప్యత మాటేంటి?

రైల్వేలో రోజుకు సుమారు 11 లక్షలకు పైగా టికెట్లు విక్రయమవుతాయి. రోజూ 60 లక్షల మంది ఐఆర్‌సీటీసీలో లాగిన్ అవుతారు. ఈ లెక్కన దాని వద్ద ఏ స్థాయిలో డేటా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ డేటాను ఎలా మానిటైజ్ చేయాలన్న దానిపై ఎంపికైన కన్సల్టెంట్ సంస్థలు ఐఆర్‌సీటీసీకి సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది. డేటా ప్రైవసీకి సంబంధించి ఐటీ యాక్ట్-2000, దాని సవరణలు, జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్, పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్-2018తో పాటు సుప్రీం కోర్టు ఆదేశాలకు లోబడి ఈ కన్సల్టెంట్ సంస్థలు ప్రణాళికలు తయారు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల డేటా గోప్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించడమే అవుతుందన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ఇన్నేళ్లుగా ఐఆర్‌సీటీసీ వద్ద పెద్ద మొత్తంలో ప్రయాణికుల వివరాలు ఉన్నా.. వాటిని దుర్వినియోగం చేసిన దాఖలాలు లేవు. ఒకసారి మానిటైజ్ పేరుతో థర్డ్ పార్టీ చేతికెళ్తే దుర్వినియోగం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్) సైతం తాజాగా ఆందోళన వ్యక్తంచేసింది. గతంలో వాహన్ డేటా బేస్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ వివరాలను దిల్లీలో లక్షిత దాడులకు వినియోగించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. వాణిజ్య ప్రయోజనాల కంటే ముందు పౌరుల హక్కులకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలని ఈ సందర్భంగా సూచించింది. అయితే, ప్రస్తుతం ఈ ప్రక్రియ ప్రాథమిక దశలోనే ఉందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. మరి ఐఆర్‌సీటీసీ దీనిపై స్పష్టతనిస్తుందో లేదో చూడాలి. 2019లో సైతం ఐఆర్‌సీటీసీ డిజిటల్ ఆస్తుల మానిటైజ్ గురించి ఆసక్తి వ్యక్తీకరణకు టెండర్‌ను ఆహ్వానించి.. ఎందుకనో వెనక్కి తగ్గింది.

అవి పేదల హక్కు..ఉచితాలు కాదు

(మొదటిపేజీ తరువాయి)

నిలుస్తాయని వ్యాఖ్యానించారు. ఆయన ప్రధానంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల హామీలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యాఖ్యలు చేశారు. ముగిసిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సమయంతో పాటు రాబోయే గుజరాత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆప్ ఉచిత విద్యుత్తు, ఉచిత నీరు వంటి హామీలు ప్రకటించిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు సైతం ఉచితాలపై స్పందిస్తూ..ఉచిత పథకాల అంశం రోజురోజుకీ సంక్లిష్టంగా మారుతోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస అవసరాలు కల్పించడాన్ని ఉచితం అనగలమా? అని ప్రశ్నించారు. బ్రిక్స్, జీ20 సభ్యదేశాల్లో భారత స్థూల ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని జయతీ ఘోష్ తెలిపారు. డిమాండ్ ఇంకా తక్కువగానే ఉందన్నారు.

నిరుద్యోగిత పెరిగిపోతోందన్నారు. పేదరికం, ఆహార అభద్రత సైతం పెరిగిపోతున్నాయని చెప్పారు. ఆర్‌బీఐ పెద్దఎత్తున ఖర్చు చేసినప్పటికీ..రూపాయి పతనం మరింత కొనసాగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. దీనివల్ల ధరలు పెరిగే ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. అయితే..నాయకులు ప్రచారం చేస్తున్నట్లు శ్రీలంక తరహాలో భారత్‌లో సంక్షోభం రాబోదని ధీమా వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వ రుణాలు శ్రీలంక స్థాయిలో లేవని గుర్తుచేశారు. సమీప భవిష్యత్తులో కొన్ని ఆర్థిక ఇబ్బందులు తప్పవని సూచనప్రాయంగా హెచ్చరిక చేశారు.

సుగర్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

(మొదటిపేజీ తరువాయి)

వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఘటనాస్థలాన్ని పోలీసుల పరిశీలించారు.

బాధితులను ఆదుకుంటాం: సమాచారం తెలియడంతో కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, ఇతర అధికారులతో కలిసి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని పూర్తిస్థాయిలో ఆదుకుంటామని, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రమాదంపై విచారణ చేపట్టినట్లు ఎస్పీ రవీంద్రబాబు తెలిపారు.

ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ షెడ్యూలు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాప్తంగా 25 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లోనే పరిశీలన ఉంటుంది. 22 నుంచి 30 వరకు అభ్యర్థులు నిర్దేశిత ఫీజు చెల్లించాలి. 23 నుంచి 31 వరకు సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. 28 నుంచి సెప్టెంబరు 2 వరకు వెబ్ ఆప్షన్లు, 3న మార్పులు, చేర్పులు, 6వ తేదీన సీట్ల కేటాయింపునకు చర్యలు చేపడతారు. 12లోగా కళాశాలల్లో రిపోర్టు చేయాలి. 12 నుంచి కళాశాలలు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది ఈఏపీసెట్‌కు ర్యాంకుల కేటాయింపులో ఇంటర్ మార్కులను పరిగణలోకి తీసుకోలేదు. పరీక్ష రాసిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులందరినీ అర్హులుగా ప్రకటించారు. మిగిలిన కేటగిరీలకు 25 శాతం వస్తే అర్హతగా నిర్ణయించారు. పూర్తి వివరాలను apsche.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

చిక్కుల్లో సిసోడియా

(మొదటిపేజీ తరువాయి)

సీబీఐ..అవినీతి నిరోధక చట్టం నిబంధనలు, నేరపూరిత కుట్ర ఐపీసీ సెక్షన్ల కింద ఆగస్టు 17న నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో 15 మంది పేర్లను పేర్కొంది. ఎక్సైజ్ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న సిసోడియాతో పాటు అప్పటి ఎక్సైజ్ కమిషనర్ అరవ గోపీకృష్ణ, అప్పటి డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ ఆనంద్ కుమార్ తివారీ, అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ పంకజ్ భట్నాగర్, తొమ్మిది మంది వ్యాపారవేత్తలు, రెండు కంపెనీలను సీబీఐ నిందితులుగా పేర్కొంది. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా కార్యాలయం నుంచి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపిన సూచన మేరకు కేసు నమోదయింది. సిసోడియా, ఇతర ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ అధికారులు 'టెండర్ తర్వాత లైసెన్సులకు అనవసరమైన ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో సరైన ఆమోదం లేకుండానే 2021-22 మద్యం విధానానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకున్నారని సీబీఐ ఆరోపించింది. వినోద కార్యక్రమాల నిర్వహణ కంపెనీ అయిన ఓన్లీ మచ్ లౌడర్ మాజీ సీఈవో విజయ్ నాయర్, పెర్నోడ్ రికార్డ్ మాజీ ఉద్యోగి మనోజ్ రాయ్, బ్రిండ్‌కో స్పిరిట్స్ యజమాని అమన్‌దీప్ ధాల్, ఇండోస్పిరిట్స్ యజమాని సమీర్ మహేంద్రూ గత ఏడాది నవంబర్‌లో తీసుకొచ్చిన ఎక్సైజ్ పాలసీని రూపొందించడం, అమలు చేయడంలో అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొంది. సిసోడియా 'సన్నిహిత అనుచరులు' అర్జున్ పాండే, దినేశ్ అరోరా, గుర్గావ్‌లోని బడ్డీ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అమిత్ అరోరా పై సీబీఐ అభియోగాలు నమోదు చేసింది. 'మద్యం లైసెన్సుదారుల నుంచి సేకరించిన అనాలోచిత ద్రవ్య ప్రయోజనాన్ని ఆరోపించిన ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్వహించడంలో, మళ్లించడంలో చురుకుగా పాల్గొన్నారని పేర్కొంది. దినేష్ అరోరా నిర్వహిస్తున్న రాధా ఇండస్ట్రీస్‌కు ఇండోస్పిరిట్స్‌కు చెందిన సమీర్ మహేంద్రు నుంచి కోటి రూపాయలు అందినట్లు సీబీఐ ఆరోపించింది. విజయ్ నాయర్ ద్వారా ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు తదుపరి చర్యల కోసం సమీర్ మహేంద్రు నుంచి అరుణ్ రామచంద్ర పిళ్లై ఆ డబ్బును వసూలు చేసేవాడని ఆ వర్గాలు వెల్లడించాయి. అర్జున్ పాండే అనే వ్యక్తి ఒకసారి విజయ్ నాయర్ తరపున సమీర్ మహేంద్రు నుంచి దాదాపు 2 నుంచి 4 కోట్ల రూపాయల భారీ నగదును వసూలు చేశాడని వివరించాయి. మద్యం విధానం కింద సన్నీ మార్వాకు చెందిన మహదేవ్ లిక్కర్స్‌కు ఎల్-1 లైసెన్స్ మంజూరయిందని సీబీఐ ఆరోపించింది. మరణించిన మద్యం వ్యాపారి పాంటీ చద్దా సంస్థల బోర్డులో ఉన్న మార్వా, ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగులతో సన్నిహితంగా ఉన్నారని, వారికి క్రమం తప్పకుండా లంచాలు ఇస్తున్నారని కూడా ఆరోపించింది.

బీజేపీ గెలుపు తేలిక కాదు

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. 2024 ఎన్నికల్లో బీజేపీకి 240 సీట్లు వస్తాయన్న అంచనాకు ఏవిధంగా వచ్చారో ఆయన వివరించారు. బీజేపీ పరిస్థితి అత్యంత దుర్బలంగా ఉందని యోగేంద్ర యాదవ్ విశ్వసించడానికి మరొక కారణం, ఇండియా టుడేలో దాని 'మూడ్ ఆఫ్ ది నేషన్ పోల్'లో భాగంగా ప్రచురితమైన ఆర్థిక పరిస్థితికి సంబంధించిన అనేక అన్వేషణలు. దేశంలో 69 శాతం మంది ప్రజలు ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సమస్యలను తమ ప్రధాన ఆందోళనగా గుర్తించారని, 67 శాతం మంది తమ ఆర్థికస్థితి క్షీణించిందని లేదా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇంకా మెరుగుపడలేదని అభిప్రాయపడ్డారు. పరిస్థితి మెరుగుపడుతుందని భావించే వారి శాతం కంటే ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుందని భావించే వారి శాతం ఎక్కువగా ఉంది. అంతరం పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. 'ఈ విధమైన రేటింగ్‌లతో సాధారణంగా ప్రభుత్వాలు అధికారం నుంచి తప్పుకుంటాయి' అని యోగేంద్ర యాదవ్ అన్నారు. ప్రజలు ఇప్పుడు తమ ఆర్థిక ఇబ్బందులను స్పష్టంగా వ్యక్తం చేయడమే కాకుండా ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని ఆయన అన్నారు. ఇండియా టుడే నుంచి వచ్చిన ఇతర పోల్‌లో 'భారతదేశంలో ప్రస్తుత ప్రజాస్వామ్య పరిస్థితి గురించి మీరు ఏమనుకుంటున్నారు?' అనే ప్రశ్నకు సమాధానంగా 48 శాతం మంది ప్రజలు ఇది ప్రమాదంలో ఉందని, 37 శాతం మంది మాత్రమే అది కాదని భావిస్తున్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని భావించే వారి శాతం గత ఆరు నెలల్లో పెరగగా, అలా కాదు అనుకునే వారి శాతం బాగా తగ్గిపోయింది. నేడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని భావించేవారికి, కాదని భావించేవారికి మధ్య వ్యత్యాసం 11 శాతం మాత్రమే. 'భారతీయులు తమ ప్రజాస్వామ్యం గురించి సానుకూలంగా ఆలోచించడానికి ఇష్టపడతారు. అందువల్ల ఈ ఫలితం చాలా పెద్ద, ముఖ్యమైన మార్పు' అని యోగేంద్ర అన్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే 2024లో బీజేపీ ఓడిపోయే అవకాశం కనిపిస్తోంది లేదా మీరు దానిని భిన్నంగా చూసినట్లయితే, ప్రతిపక్షం ఓడిపోయే ఎన్నికలుగా మారుతోందని, అయితే, విపక్షాలు కలిసి పని చేస్తే సులభంగా విజయం సాధించవచ్చని ఆయన చెప్పారు. ఆర్థిక సంక్షోభంతో పాటు ప్రజాస్వామ్యం గురించిన ఆందోళనకు ప్రతిస్పందించడానికి ప్రతిపక్షాలు సరైన సందేశాలను కనుగొనగలిగితే, అది బీజేపీకి 272 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవచ్చని అన్నారు.

ముఖ హాజరు మంటలు

(మొదటిపేజీ తరువాయి)

పథకాల యాప్‌లతో ఇప్పటికే ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. కొత్తగా ముఖ గుర్తింపు యాప్ తీసుకొచ్చి, ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం వల్ల ఫలితమేమీ ఉండబోదని సూచిస్తున్నారు. ఈ విధానాన్ని అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగులకు తీసుకురావాలనే యోచన పై ఉద్యోగ సంఘాలు భగ్గుమంటున్నాయి. ఇప్పటికే సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం నాన్చుడు ధోరణితో ఉంది. సీపీఎస్ రద్దు చేయాలంటూ సెప్టెంబరు 1వ తేదీన సీఎం ఇంటి ముట్టడికి సీపీఎస్ ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. అదే రోజు మిలీయం మార్చ్‌ను మరో సంఘం నిర్వహించనుంది. దీంతో ప్రభుత్వం ఒక్కసారిగా అప్రమత్తమై, సీపీఎస్‌పై ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్ణయించింది. అక్కడ సీపీఎస్‌పై ప్రస్తావించకుండా, జీపీఎస్ అంశాన్ని మళ్లీ తెరపైకి మంత్రివర్గ సభ్యులు, ఆర్థికశాఖాధికారులు తీసుకొచ్చారు. దీనిపై ఉద్యోగ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఐదు గంటలపాటు జరిగిన సమావేశంలో సీపీఎస్ రద్దు అంశంపై ప్రభుత్వం తేల్చలేకపోయింది. దానికితోడుగా ముఖ గుర్తింపు యాప్‌నకు ప్రభుత్వం ఉత్తర్వుల జారీజేయడంపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి. సీపీఎస్ ఉద్యోగుల ఆందోళనకు ఉపాధ్యాయ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. దీంతో ప్రభుత్వం ఉపాధ్యాయులపై ఒత్తిళ్లు పెంచుతూ, యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తోంది. ఉద్యోగ భద్రత కోసం చాలా మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోగా, మిగిలిన వారు వేచిస్తున్నారు. ప్రభుత్వ తీరును ఉద్యోగ సంఘాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి. పాఠశాలల్లో ప్రాథమిక పరికరాలు కల్పించకుండా, ముఖ గుర్తింపు యాప్ ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. కనీస సాంకేతిక సౌకర్యాలు కల్పించి, గతంలో తరహాగా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

సర్టిఫికెట్లు ఆపొద్దంటూ ఇంటర్‌బోర్డు కీలక ఆదేశాలు

హైదరాబాద్: అంబర్‌పేట పరిధిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో దారుణం చోటు చేసుకుంది. టీసీ గురించి మాట్లాడదామని ప్రిన్సిపల్ గదికి వెళ్లిన ఓ విద్యార్థి నాయకుడు తనతోపాటు తెచ్చుకున్న పెట్రోల్ మీద పోసుకున్నాడు. పక్కనే దీపం ఉండటంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. వాటిని అదుపు చేసేందుకు ప్రయత్నించిన ప్రిన్సిపల్, పాలనా అధికారికి గాయాలయ్యాయి. బాధితులు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఇంటర్ బోర్డు కార్యదర్శికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నివేదిక అందిన తర్వాత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఇంటర్ బోర్డు కీలక ఆదేశాలు..

అంబర్‌పేట ప్రైవేటు కళాశాల ఘటన నేపథ్యంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి జలీల్ కీలక ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లు ఆపవద్దని కాలేజీలకు ఆదేశాలు జారీ చేశారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన బాధ్యత ప్రిన్సిపల్స్‌దేనని స్పష్టం చేశారు. కారణమేదైనా విద్యార్థుల సర్టిఫికెట్లు ఆపడానికి వీల్లేదని హెచ్చరించారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోతే డీఐఈవో, ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రైవేటు కాలేజీలను తనిఖీ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

పొలం ఆక్రమించారు..సాయం చేయండి

చంద్రబాబును కలిసిన రాయచోటి బాధిత కుటుంబం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ నేతలు తమ పొలం ఆక్రమించి బెదిరిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డి పల్లి మండలం పందిళ్ల పల్లి గ్రామానికి చెందిన కొమ్మెర గంగాధర అనే వ్యక్తి టీడీపీ అధినేత చంద్రబాబును శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. తన 3 ఎకరాల 55 సెంట్ల భూమిని వైసీపీ నేతలు ఆక్రమించారని చంద్రబాబుకు గంగాధర వివరించారు. భూమి తమకు ఉచితంగా రాసి ఇచ్చేయాలని స్థానిక వైసీపీ నేత ఆర్ రాజేందర్ రెడ్డి తనను తీవ్రంగా బెదిరించగా, అంగీకరించకపోవడంతో తనపై దాడి చేశారని చెప్పారు. దాడి కారణంగా తాను ఆసుపత్రి పాలయ్యానని...పోలీసులు కనీసం కేసు కూడా తీసుకోలేదని వివరించారు. ఇప్పటికీ తనను పొలం లోకి రానివ్వడం లేదని, రెవెన్యూ అధికారులు, ఎస్పీ, కలెక్టర్‌ను కలిసినా న్యాయం జరగలేదని గంగాధర పేర్కొన్నారు. కుటుంబంతో కలిసి వచ్చి తనకు సాయం చేయాలని చంద్రబాబును కోరారు.

శిక్ష అనుభవించాల్సిందే: కేటీఆర్

హైదరాబాద్: గుజరాత్‌లో 2002లో చోటుచేసుకున్న బిల్కిస్ బానో గ్యాంగ్ రేప్ కేసులో 11 మంది దోషులను అక్కడి ప్రభుత్వం విడుదల చేయడంపై మంత్రి కేటీఆర్ బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఒమిషన్, కమిషన్, రెమిషన్ లాంటి చర్యలను మరిచిపోలేమని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ అంశంపై ట్విటర్లో స్పందించిన కేటీఆర్.. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో గెలిచేందుకు అభివృద్ధి, భద్రత, సంక్షేమంపై ఎన్నో హామీలు చూశామన్నారు. అయితే, ఇప్పుడు రేపిస్టులు, గర్భిణిలు, చిన్నారులను హత్య చేసిన వారిని విడుదల చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి ఖైదీల విడుదల, శిక్ష తగ్గింపు ఎప్పటికీ మరిచిపోలేమన్న ఆయన... కర్మ సిద్ధాంతం ప్రకారం నేరానికి శిక్ష అనుభవించాల్సిందేనని గుర్తు చేశారు.

సీజేఐకు లేఖ రాసిన ఎమ్మెల్సీ కవిత

బిల్కిస్‌బానో అత్యాచార కేసులో దోషులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడంపై జోక్యం చేసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ రాశారు. అత్యాచారం వంటి నేరాల్లో శిక్ష పడిన దోషులు స్వాతంత్ర్య దినోత్సవాన విడుదల కావడం ప్రజల వెన్నులో వణుకు పుడుతోందని లేఖలో పేర్కొన్నారు. సీబీఐ కేసుల్లో దోషులకు శిక్ష తగ్గింపు లేదా విడుదల చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని సీఆర్‌పీసీ చెబుతోందన్నారు. ఈ కేసులో దోషుల విడుదలకు గుజరాత్ ప్రభుత్వం కేంద్రాన్ని సంప్రదించిందో లేదో తెలియదన్నారు. శిక్ష తగ్గింపులో ప్రభుత్వాలు ఏకపక్షంగా అధికారాలను ఉపయోగించవద్దని, వాస్తవిక దృష్టితో చూడాలని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసిందన్నారు. రేపిస్టులు బయటకు రావడాన్ని, పూలదండలతో వారికి స్వాగతం పలకడాన్ని చూసి బానో మనసు ముక్కలై ఉంటుందన్నారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని దోషుల విడుదల నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చర్యలు చేపట్టి, చట్టాలపై విశ్వాసాన్ని, మానవత్వాన్ని కాపాడాలని సీజేఐను కవిత కోరారు.

అందరూ కోరుకుంటే నితీశ్ ప్రధాని అభ్యర్థి: జేడీయూ

న్యూఢిల్లీ: ఇతర ప్రతిపక్షాలు కోరుకుంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ప్రతిపక్షాల ప్రధానమంత్రి అభ్యర్థిగా ఒక ఎంపిక అవుతారని జేడీ(యూ) అధ్యక్షుడు లాలన్‌సింగ్ పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడానికి ప్రతిపక్ష పార్టీలను ఏకం చేయడంపై నితీశ్‌కుమార్ ప్రధానంగా దృష్టి పెట్టారని, బీహార్‌లో వచ్చేవారం అసెంబ్లీ విశ్వాస తీర్మానం తర్వాత వివిధ పార్టీలకు చెందిన నేతలను కలవడానికి ఆయన దేశ రాజధాని దిల్లీకి వెళ్తారని లాలన్ సింగ్ తెలిపారు. ప్రతిపక్షాల ప్రధానమంత్రి అభ్యర్థిత్వానికి నితీశ్ పోటీదారు కాదని ఆయనకు అత్యంత సన్నిహితుడైన సింగ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఇతర ప్రతిపక్ష పార్టీలు నితీశ్‌కు మద్దతునిచ్చినట్లయితే పార్టీ వైఖరి ఏంటన్న ప్రశ్నపై లాలన్‌సింగ్ స్పందిస్తూ... అలాంటి పరిస్థితే వస్తే ఇదొక ఎంపిక అవుతుందని చెప్పారు. బీహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటు కోసం బీజేపీతో తెగదెంపులు చేసుకొని దాని ప్రత్యర్థులతో పొత్తు పెట్టుకున్న తర్వాత శరద్ పవార్, అరవింద్ కేజ్రీవాల్ సహా చాలా మంది ప్రతిపక్ష నాయకులు నితీశ్‌ను అభినందించిన విషయాన్ని లాలన్‌సింగ్ గుర్తు చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి నాయకత్వాన్ని నిర్ణయించుకోవాలని లేదా బీజేపీని ఓడించడానికి అన్ని పార్టీలు ఐక్యంగా పోరాడాలని, ఎన్నికల తర్వాత తమ నాయకుడెవరన్నది నిర్ణయించుకోవాలని సూచించారు. బీజేపీతో పోరాడుతున్న ఇతర పార్టీలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావడానికి నితీశ్‌కుమార్ కృషి చేస్తారని పేర్కొన్నారు. 2013-17 మధ్య కాలంలో మినహా 1996 నుండి తన మిత్రపక్షంగా ఉన్న బీజేపీతో బంధాన్ని తెంచుకోవాలని నితీశ్ తీసుకున్న నిర్ణయం... ఆయన ప్రధాని అవడానికే ఈ విధంగా చేశారన్న ఊహాగానాలకు ఆజ్యం పోసింది. ఆర్జేడీ-కాంగ్రెస్-లెఫ్ట్ కూటమితో చేతులు కలపాలన్న నితీశ్ నిర్ణయం వెనుక అసలు సంగతి ఇదేనని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. అయితే కుమార్ అటువంటి వాదనలను తిరస్కరించారు.

యూపీలో ఆటవిక రాజ్యం: మాయావతి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఆటవిక రాజ్యం విస్తరించిందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం వరుస ట్వీట్లు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని అది బీజేపీ సర్కారు వంచన మాత్రమేనని ఆమె దుయ్యబట్టారు. 'బందాలోని యమునా నదిపై అసంపూర్తిగా ఉన్న వంతెన కారణంగా పడవ ప్రమాదంలో చాలా మంది మృతిచెందారు... విచారణ నిమిత్తం హాపూర్‌కు తీసుకొచ్చిన అండర్ ట్రయల్ ఖైదీని కాల్చి చంపారు... ఇప్పుడు హమీర్‌పూర్‌లో సామూహిక అత్యాచారం ... ఈ సంఘటనలు ఉత్తరప్రదేశ్‌లో ఆటవిక రాజ్యం ఉందని రుజువు చేస్తున్నాయి... అభివృద్ధి కేవలం ప్రచారం మాత్రమే' అని మాయవతి పేర్కొన్నారు.

సంపాదకీయం

కశ్మీర్‌లో పాగాకు బీజేపీ కుటిల యత్నాలు

హిందువుల ఓట్లను ఎలా దండుకోవాలి అన్న విషయంలో భారతీయ జనతా పార్టీ అనితర సాధ్యమైన ఆధిపత్యం సంపాదించింది. ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న జమ్మూ-కశ్మీర్ లాంటి చోట్ల అధికారం సంపాదించడానికి కూడా బీజేపీ మార్గం కని పెట్టింది. స్థానికేతరులకు కూడా ఓటర్ల జాబితాలో స్థానం కల్పించే కార్యక్రమం ప్రారంభించింది. సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ లాంటి కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సంస్థలను మోదీ ప్రభుత్వం తన పరిచారికలుగా మార్చుకుంది. అలాంటప్పుడు ఎన్నికల కమిషన్‌ను మాత్రం ఎందుకు వదిలి పెడ్తుంది? జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని రద్దు చేసి మూడేళ్లు అయింది. కశ్మీర్, లద్దాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చింది. అక్కడ ఎన్నికలు నిర్వహిస్తామని మోదీ సర్కారు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటే సమీప భవిష్యత్తులో ఎన్నికలు జరగాల్సిందే. అయితే అధికారం తమకే దక్కాలంటే మునుపు ఉన్న పరిస్థి తుల ప్రకారం కుదరదు కనక తమకు అనుకూలమైన ఓటర్ల సంఖ్య పెంచే పనిలో పడింది. అంటే అక్కడి జనాభా స్వరూపం మార్చ డానికి బీజేపీ సిద్ధమైంది. జమ్మూ-కశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంలో శాశ్వతంగా నివాసం ఉంటున్నవారు కాకపోయినా తమ పేర్లు ఓటర్ల జాబితాలో చేర్పించుకోవచ్చునని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇది ప్రజా స్వామ్య వ్యవస్థను విచ్ఛిన్నం చేయడమేనని ప్రతిపక్షాలు ఆందోళన చెందు తున్నాయి. జమ్మూ-కశ్మీర్ ప్రజల్లో ముస్లింలే అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ దేశ విభజన సమయంలో వారు పాకిస్తాన్‌కు వెళ్లిపోకుండా భారత్‌లోనే ఉండిపోవాలనుకున్నారు. ఎన్నికలు జరిగిన అనేకసార్లు అక్కడ కేంద్ర ప్రభుత్వ అండదండలతో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు తీవ్రంగానే ఉన్నాయి. జమ్మూ-కశ్మీర్‌లో కాంగ్రెస్ లాంటి రాజకీయ పార్టీల కన్నా ఎప్పుడూ నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ లాంటి ప్రాంతీయ పార్టీలకే ఎక్కువ పలుకుబడి ఉంటూ వచ్చింది. కాంగ్రెస్ కొన్ని సార్లు అక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవకాశం వచ్చినప్పటికీ ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం ప్రస్ఫుటంగా కనిపించేది. భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరవాత జమ్మూ-కశ్మీర్‌లోనూ పాగా వేయాలనుకుంది. ముస్లిమేతరులు అధిక సంఖ్యలో ఉండే జమ్మూలో గణ నీయమైన విజయాలు కూడా సాధించింది. మహబూబా ముఫ్తీ నాయ కత్వంలోని పి.డి.పి. వేర్పాటు ధోరణులను ప్రోత్సహిస్తుంది అని ఆరోపించిన బీజేపీయే పి.డి.పి.తో కలిసి సంకీర్ణ ప్రభుత్వంలో అధికారం చెలాయించింది. అర్థాంతరంగా పి.డి.పి.కి మద్దతు ఉపసంహరించింది. ఒంటరిగా అధికారంలోకి రావా లన్న దుగ్ధతో ఓటర్ల నమోదు కార్యక్రమ నియమ నిబంధనలను తనకు అనుకూలంగా మార్చుకుంటోంది. ఆ రాష్ట్రంలో బీజేపీ ఆగడాల తరవాత ప్రతిపక్ష పార్టీలు గుప్కార్ అలయన్స్ ఏర్పాటు చేసి బీజేపీని ఎదుర్కోవడానికి ప్రయత్నిస్తు న్నాయి. ఐక్య కార్యాచరణ ఖరారు చేయడానికి సమావేశం నిర్వహించా లని గుప్కార్ కూటమిలోని పార్టీలు భావిస్తున్నాయి. ఈ కూటమిలో భాగస్వామ్య పక్షాలు కాని పార్టీల నాయ కులను కూడా నేషనల్ కాన్ఫరెన్స్ అధినాయకుడు ఫరూఖ్ అబ్దుల్లా సంప్రదిస్తున్నారు. ఈ సమావేశం వచ్చే సోమవారం జరగనుంది.

స్థానికేతరులకు ఓటర్ల జాబితాలో చోటు కల్పించే ప్రయత్నాలను అక్కడి ప్రాంతీయ పార్టీలన్నీ వ్యతిరేకిస్తున్నాయి. బీజేపీ అనుసరిస్తున్న విచ్ఛిన్నకర విధానాలకు వ్యతిరేకంగా గొంతెత్తాలని పి.డి.పి. నాయకురాలు మహ బూబా ముఫ్తీ దేశంలోని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో స్థానికేతరులకు చోటు కల్పించడం ఎన్నికలకు ముందే అక్ర మాలకు పాల్పడడం అని మహబూబా భావిస్తున్నారు. వచ్చే శాసనసభ ఎన్ని కలలో 25 లక్షల మంది స్థానికేతరులకు ఓటు వేసే అవకాశం కల్పించి లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. కేంద్రంలోనే కాక అన్ని రాష్ట్రాలలోనూ తమ పార్టీ అధికారమే కొనసాగాలన్నది మోదీ లక్ష్యం. జమ్మూ-కశ్మీర్‌లో పరి స్థితి భిన్నమైంది కనక అక్కడ స్థానికేతరులకు ఓటర్ల జాబితాలో అవకాశం కల్పించి జమ్మూ, లద్దాఖ్ ప్రాంతాలలోనే కాకుండా కశ్మీర్ లోయలోనూ తమ ఆధిపత్యం కొనసాగేట్టు చేయాలన్నది మోదీ ఎత్తుగడ. స్థానికేతరులకు ఓటర్ల జాబితాలో చోటు దక్కితే జమ్మూతో పాటు కశ్మీర్ ప్రాంత ఓటర్ల ఓట్లు కూడా ఎందుకూ కొరగాకుండా పోతాయి. ఇతర రాష్ట్రాలలో డబ్బు సంచులు గుమ్మరించి, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి, ప్రత్యర్థుల మీద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ లాంటి కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సంస్థలను ఉసిగొల్పి ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసి అధికారం సంపాదించే ప్రక్రియను బీజేపీ ఇదివరకే దివ్యంగా అమలు చేస్తోంది. జమ్మూ-కశ్మీర్‌లోకి ఏకంగా తనకు అనుకూలమైన ఓటర్లనే ఎగుమతి చేయడానికి మోదీ ప్రయత్నిస్తు న్నారు. అయితే బీజేపీ అగ్ర నాయకుడు అటల్ బిహారీ వాజపేయి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు జమ్మూ-కశ్మీర్‌లో స్వేచ్ఛగా, నిష్పక్ష పాతంగా ఎన్నికలు నిర్వహించడానికే ప్రాధాన్యం ఇచ్చారు. వాజపేయికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉండేది. మోదీ నాయకత్వంలోని బీజేపీ మాత్రం మరో అడుగు ముందుకేసి ఏకంగా ఓటర్ల జాబితాలో స్థానికేతరులకు అవకాశం కల్పించి జనాభా స్వరూపాన్నే సమూలంగా మార్చాలని కంకణం కట్టుకున్నది. వైవి ధ్యాన్ని ఏ మాత్రం భరించలేని బీజేపీ ఎంతకైనా తెగిస్తుందనడానికి జమ్మూ-కశ్మీర్‌లో తాజా పరిణామాలే ప్రబల నిదర్శనం. 370వ అధికరణాన్ని రద్దు చేయడంతో ఆ ప్రాంతం ప్రత్యేక అస్తిత్వాన్ని కోల్పోయింది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో జమ్మూ-కశ్మీర్ భారత యూనియన్‌లో చేరడానికి కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. హామీలు గుమ్మరించారు. అయితే కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా ఈ హామీలను ఉల్లం ఘించిన సందర్భాలే ఎక్కువ. దీనితో కశ్మీర్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం మీద అపనమ్మకం పెరిగింది. 370వ అధికరణం కారణంగానే జమ్మూ-కశ్మీర్‌లో తీవ్రవాదం పెట్రేగి పోతోందని, వెనుకబడి ఉందని బీజేపీ వాదిస్తూ వచ్చింది. కానీ 370వ అధి కరణం రద్దు తరవాత అక్కడి పరిస్థితులు మారిన దాఖలాలు లేవు. తీవ్ర వాదం తగ్గుముఖం పట్టినట్టు కనిపిస్తున్నా దానికి కారణం అక్కడ లక్షల సంఖ్యలో భద్రతా దళాలను మోహరించడమే. ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాయడమే. వాస్తవ పరిస్థితి తెలియడానికి అవకాశమే లేనప్పుడు ఏం జరుగుతోందో, ప్రజల అభిప్రాయం ఏమిటో బయటపడే అవకాశమే లేదు. ఒకప్పుడు ఆ రాష్ట్రంలో అస్తిత్వమే లేని బీజేపీ ఇప్పుడు అధికారం కబళించ డానికి సకలవిధ ప్రయత్నాలూ చేస్తోంది. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై బీజేపీ ఆగడాలను నిలువరించగలిగితే తప్ప అక్కడ ప్రశాంత పరిస్థితి ఏర్పడదు. ప్రజల ఆకాంక్షలు వ్యక్తమయ్యే అవకాశమూ రాదు. ఆ ఆకాంక్షలు నెరవే రడం సుదూర స్వప్నమే. ఒక జాతిని, ఒక ప్రాంతం వారిని సకలవిధ మాయోపాయాలు ప్రయోగించి అణచి పెట్టడానికి చేసే ప్రయత్నం తాత్కాలికంగా ఫలించినా అసలు సమస్య మాత్రం అలాగే మిగిలి పోతుంది. అధికారం కబళించడమే తప్ప సమస్య పరిష్కరించడం బీజేపీ ఉద్దేశం కాదు.



సృజనకారులను కాపాడుకుందాం

సృజనకు కాలం కాదిది. సృజనకారులు తమ కలాలకు తాళం వేసు కోవాల్సిన మాయదారి కాలం. ఈ రాష్ట్రం, ఆ రాష్ట్రం అని కాదు... ఈ దేశం... ఆ దేశం అని కాదు. ప్రపంచమంతా అలాగే ఉంది. ఒకప్పుడు ఏ దేశంలోనైనా కవులను కాని, రచయితలను కాని ఆయా దేశాల, రాష్ట్రాల ఏలికలు నెత్తి మీద పెట్టుకున్న సువర్ణలోకం ఇప్పుడు ఎక్కడ చూసినా లేదు. నిజానికి సమాజం ఎదుగుదలకు, ఏ జాతి అయినా అభివృద్ధి చెందేందుకు కవులు, రచయితలే కారకులు. ఇప్పుడు ఆ రోజులు లేవు. ఇప్పుడున్న పరి స్థితులలో కవులను, రచయితలను చరిత్రలో చదువుకోవాలే కాని నేరుగా చూసే, చదివే కాలం ఉండేలా లేదు. కవులు రాయాలి. కాని ప్రభువులకు నచ్చిందే రాయాలి. రచయితలు అద్భుతమైన సృజన చేయాలి. కాని అది కూడా ఏలికలకు నచ్చిందే అయి ఉండాలి. అంతే కాదు.... కొన్ని సమూ హాలకు కూడా కోపం రాకుండా... వారిని మెప్పించే విధంగా రాస్తే ఆ కవి, రచయిత బతికి బట్టకట్టగలడు. ఇప్పుడు లోకమంతా అదే తీరు. లోకమంతా అదే ధోరణి.

చక్రవాకం
- ముక్కాముల చక్రధర్

ఒక రచయితను చంపితే లక్షల డాలర్లు ఇస్తానని ఓ దేశం ప్రకటిస్తుంది. మరో రచయితను లేకుండా చేస్తే కేసులు లేకుండా చేస్తానంటుంది మరో ఏలిక. రచయితలు, కవులు తమను తాము కాపాడుకోవడానికి, లేదూ ఈ లోకంలో బతికుండడానికి చేయాల్సిన పనులు రెండే. ఒకటి ఏ సృజన చేయ కుండా రామకోటి రాసుకోవడం. లేదూ ప్రభువులను కీర్తిస్తూ రాయడం. ఇవేవీ చేయలేకపోతే లోకాన్ని చూస్తూ లోలోపల కన్నీరు కార్చడం. ఒక మతాన్ని అడ్డం పెట్టుకుని దారుణాలకు ఒడిగట్టేవారు నీ రాతలను గమనిస్తూ ఉంటారు. మరో మతాన్ని కీర్తించకుండా రాసిన వారికి ఆ మత పీఠాధి పతులు ఉరిశిక్షలు వేసేందుకు కూడా సిద్ధపడుతున్న విషాద దృశ్యం. దీనికి ఆయా సృజనకారుల వయసుతో కాని, అనారోగ్య పరిస్థితులతో కాని ఏలిక లకు, మూఢ మతస్తులకు పని లేదు. అతని రచనలే ఆ కవిని, రచయితను లేకుండా చేసేందుకు గీటురాళ్లు. దీనికి ఏలికలే కాదు... మత మూఢులు కూడా మినహాయింపు కాదు.

సల్మాన్ రష్దీ. ఏం చేశారు. తాను నమ్మిన, విశ్వసించిన అంశాలకు తన సృజనను జోడించి రచనలు చేశాడు. ప్రజాస్వామ్య దేశాలలో విచ్చలవిడి శృంగార రచనలు మినహా మిగిలిన సృజనకు నిషేధం లేదు. కాని, ఓ మతా నికి వ్యతిరేకంగా రాసాడని భావించిన ఆ మతస్తులలోని కొందరు మూఢులు రష్దీ నిర్మూలనకు ఫర్మాలు జారీ చేశాయి. ముంబయిలో పుట్టిన సల్మాన్ రష్దీ బతుకు భయంతో విదేశాల్లో తల దాచుకున్నాడు. అక్కడా వదలలేదు. వందల మంది చూస్తుండగా రష్దీపై కత్తులతో దాడి చేసాడు ఓ ఉన్మాది. సమాజం, ప్రభుత్వాలు అపురూపంగా చూసుకోవాల్సిన సృజనకారులు తల దాచుకునేందుకు మరో దేశానికి వెళ్లిపోవడాన్ని మించిన దారుణం ఏముంటుంది.

గతంలో మన దేశంలో కూడా ఇలా సృజనకారులపై దాడులు జరగడం చూసాం. విన్నాం. సమాజంలో కవులు, రచయితలను లేకుండా చేయాలను కోవడం ఏ ప్రభుత్వానికైనా, ఏ మత సంస్థకైనా మంచిది కాదు. తమను విమర్శించిన వారిపై భౌతిక దాడులు చేయడం, వారిని జైళ్లలో ఉంచడం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇవ్వడమే. సృజన లేని లోకాన్ని ఊహించుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. నిజానికి కవులు, రచయితలే ఆయా ప్రభుత్వాలకు, సంస్థలకు నిజమైన మార్గదర్శకులు. వారు తమ రచనలలో, సృజనలో ఎత్తిచూపే అంశాలపై ఏలికలు సానుకూల దృక్పథాన్ని చూపిస్తే, ఆ కవిత్వంలోని విమర్శలను సీరియస్‌గా తీసుకుంటే అది ఆయా ప్రభుత్వాలకు మేలు చేసేవి అవుతాయి తప్ప హాని కలిగించేవి ఎన్నటికీ కావు. ఈ నిజాన్ని ఏలికలు, మత సంస్థలు ఎంత త్వరగా గుర్తిస్తే సృజనకారులకు అంత మంచిది. లేకపోతే ఇదిగో ఇలా కవులు, రచయితలపై ఫలానా చోట దాడి జరిగిందనో, లేదూ వినకూడని మాటో వినాల్సి వస్తుంది. ఇది సమాజానికి అంత మంచిది కాదు.

వ్యాస రచయిత సెల్ 9912019929

జాతీయోద్యమంలో సీపీఐ వీరోచిత పాత్ర

డా. బి.కె. కాంగో

దేశ వ్యాప్తంగా జరిగిన 75వ స్వాతంత్ర్య దినోత్సవాలలో కమ్యూనిస్టు శ్రేణులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పోస్టర్ల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు ఏర్పాటు అయినాయి. కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా జాతీయోద్యమంలో పాల్గొన్న సమర యోధులను, వారి కుటుం బాల వారిని అనేక చోట్ల సన్మానించారు.

జాతీయోద్యమంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర గురించి ఈ తరం పార్టీ కార్యకర్తలకు తెలియజేయడానికి చిన్న చిన్న పుస్తకాలు, కరపత్రాలు ప్రచురిం చారు. సంపూర్ణ స్వరాజ్యం కావాలని మొట్టమొదట 1923లో పిలుపు ఇచ్చింది అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎ.ఐ.ఎస్.ఎఫ్.) కావడం కమ్యూనిస్టు పార్టీకి గర్వకారణం. ఈ పిలుపుతో స్ఫూర్తి పొందిన కమ్యూనిస్టు పార్టీ పోరాటం కొనసాగించింది. మొదట వివిధ బృందాలుగానే కమ్యూనిస్టులు పని చేశారు. 1925 డిసెంబర్ 26న కమ్యూనిస్టు పార్టీ నిర్దిష్టమైన వ్యవస్థగా అవతరించింది.

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడగానే బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. మార్క్సిస్టు సాహిత్యాన్ని కూడా నిషేధించింది. అనేక మంది సీపీఐ నాయకులను, కార్య కర్తలను జైళ్లల్లో పెట్టింది. కమ్యూనిస్టు పార్టీ నాయకుల మీద కాన్పూర్ కుట్ర కేసు, మీరట్ కుట్ర కేసు, పెషావర్ కుట్ర కేసు లాంటి అనేక కేసులు మోపారు. ఈ అణచివేతలన్నింటినీ కమ్యూనిస్టు నాయకులు ఎదుర్కోవలసి వచ్చింది.

స్వాతంత్ర్య పోరాటం ప్రజోద్యమంగా మారినప్పుడు కార్మికులను, రైతులను, గిరిజనులను సమీకరించి పోరాటం కొనసాగించింది కమ్యూనిస్టు పార్టీయే. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎ.ఐ.ఎస్.ఎఫ్.), అఖిలభారత కిసాన్ సభ, అభ్యుదయ రచయితల సంఘం లాంటి ప్రజాసంఘాల ఏర్పాటుకు చొరవ చూపింది కమ్యూనిస్టు పార్టీనే. ఈ సంఘాల ద్వారా విద్యార్థులు, రచయితలు, రైతులు, కళాకారులు స్వాతంత్రోద్యమంలో పాల్గొనేట్టు చేయడంలో సీపీఐ నిర్ణాయక పాత్ర పోషించింది. ఈ సంఘాలన్నీ 1936లోనే ఏర్పడ్డాయి. అదే సమయంలో ఫాసిజం కారు మేఘాలు కూడా ప్రపంచాన్ని, ముఖ్యంగా యూరప్‌ను ఆవరించాయి.

1942లో కమ్యూనిస్టులు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనలేదని కమ్యూనిస్టులను శత్రువులు దెప్పి పొడుస్తుంటారు. కానీ మానవాళి మనుగడకే ముప్పు తెచ్చిన ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులే అని మాత్రం చెప్పరు. ఫాసిస్టు సవాలును ఎదుర్కొని తీరాల్సిందేనని ఆ రోజుల్లో సీపీఐ భావించింది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు విపరీతమైన బాధలకు గురయ్యారు.

ఈ స్థితిలో మనం స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడం అంటే భారత్ అన్న భావనకు కట్టుబడి ఉండాలి. అలాగే ప్రజలను సాధికారికుల్ని చేయాలి. అప్పుడే స్వాతంత్ర్యం, సాధికారికత సాధ్యం అవుతాయి. వీటివల్లే మానవా భ్యున్నతి సాధ్యం అవుతుంది. ఆధిపత్యంవల్ల ఏమి జరగదు. స్వాతంత్ర్యం ప్రజల కోసమే తప్ప ఫాసిస్టులు, ప్రతీప శక్తులు వాదిస్తున్నట్టుగా దేశం కోసం ప్రజలు కాదు. ప్రజల కోసం దేశం కావాలి.

కాంగ్రెస్‌కు, ఆ పార్టీ మద్దతుదార్లకు ఫాసిజంవల్ల ముంచుకొచ్చే ముప్పు గురించి తెలియదని కాదు. స్వతంత్ర భారత్ ఫాసిస్టులకు వ్యతిరేకంగా పోరాడు తుందని అనుకున్నారు. స్వాతంత్ర్య సాధనలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడడానికి ఫాసిస్టులతో కలవాలన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ వాదనను కమ్యూనిస్టులు, కాంగ్రెస్ అంగీకరించలేదు.

క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అరుణా ఆసఫ్ అలీ, కామ్రేడ్ క్రాంతి సింగ్ నానా పాటిల్, తూఫాన్ సేనకు చెందిన వారి అనుచరులు, అజయ్ ఘోష్ లాంటి భగత్ సింగ్ అనుచరులు, గదర్ పార్టీ నాయకుడు సోహన్ సింగ్ జోష్ లాంటి వారు ఎందరో తరవాత కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

1946లో నావికుల తిరుగుబాటులో కమ్యూనిస్టు పార్టీ పోషించిన పాత్ర ప్రశంసనీయమైంది. భారత స్వాతంత్ర్య పోరాటం ప్రజాస్వామ్యం, సాధికారికత కోసం కనక సీపీఐ 571 సంస్థానాధీశులుగా ఉన్న ఫ్యూడల్ శక్తులకు వ్యతి రేకంగా కూడా వీరోచిత పోరాటం చేసింది. హైదరాబాద్ నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కొనసాగించిన పోరాటం చరిత్రాత్మకమైంది. ఈ పోరాట ఫలి తంగా మూడు వేల గ్రామాలలో రైతులకు, భూమి లేని నిరుపేదలకు భూములు పంచడం సాధ్యమైంది. జాగీర్దార్లు పారిపోవలసి వచ్చింది. ఈ భూపోరాటాల కారణంగానే వివిధ రాష్ట్రాలు భూ సంస్కరణ చట్టాలు తీసుకురావలసి వచ్చింది. దున్నే వాడికే భూమి లాంటి చట్టాలు వచ్చాయి. ఇది భూస్వామ్య వ్యవస్థను చావు దెబ్బ తీసింది.

75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న సమయంలో దేశ స్వాతం త్ర్యానికి ముప్పు ఎదురవుతోంది. స్వాతంత్ర్య పోరాట కాలంలో ప్రోది చేసిన భారత్ అన్న భావనకు విఘాతం కలుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా రైతుల, కార్మికుల ఉద్యమాలు ప్రధానంగా 1917 నాటి రష్యా విప్లవం ప్రజాస్వామ్య ఉద్యమాలను ఎదుర్కోవడానికి కులీన వర్గాల వారు సమీకృతం కావలసి వచ్చింది. ఈ వర్గాల స్వార్థ ప్రయోజనాలు కాపాడడానికే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) లాంటి సంస్థలు అవతరించాయి. ఆర్.ఎస్.ఎస్. "బలశాలి భారత్"ను నిర్మించాలంటుంది. ఈ శక్తి ఉన్నత వర్గాల, అగ్రవర్ణాల, గుత్త పెత్తందార్ల నుంచే సమకూరుతుంది. ముఖ్యంగా అంతర్జాతీయ పెట్టుబడిదార్ల, బడా వ్యాపారవేత్తల సహాయం అవసరం అవుతుంది. సాంస్కృతిక నేపథ్యం పేరుతో విచ్చలవిడి జాతీయతా వాదాన్ని ప్రోత్సహిస్తున్నారు. బలమైన సైన్యం ఉండాలనేది కూడా ఈ భావనలో భాగం.

ఈ స్థితిలో మనం స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడం అంటే భారత్ అన్న భావనకు కట్టుబడి ఉండాలి. అలాగే ప్రజలను సాధికారికుల్ని చేయాలి. అప్పుడే స్వాతంత్ర్యం, సాధికారికత సాధ్యం అవుతాయి. వీటివల్లే మానవా భ్యున్నతి సాధ్యం అవుతుంది. ఆధిపత్యంవల్ల ఏమి జరగదు. స్వాతంత్ర్యం ప్రజల కోసమే తప్ప ఫాసిస్టులు, ప్రతీప శక్తులు వాదిస్తున్నట్టుగా దేశం కోసం ప్రజలు కాదు. ప్రజల కోసం దేశం కావాలి.

ఫోన్‌కే కాదు.. మెయిల్‌కూ పంపాలి

ఐ-మెయిల్

దేశంలో అత్యధిక బ్యాంకులు నెట్ బ్యాంకింగ్‌లో కీలకమైన 'వన్ టైం పాస్ వర్డ్' సెల్ ఫోన్‌కే పంపుతున్నాయి. దీని వలన సుమారు 15 శాతం కంటే ఎక్కువగా నెట్ బ్యాంకింగ్ వెనుకపడుతోంది. అందుకు ముఖ్యకారణాలు ఒక్కోసారి సెల్‌ఫోన్ దగ్గర ఉండదు, ఉన్నా కొన్ని ఊళ్లలో పట్టణాలలో నెట్‌వర్క్ పని చేయదు. అనుకోని పరిస్థితులలో సెల్ పాడైపోయినా, చోరీ అయినా నెట్ బ్యాంకింగ్ పని ఆగినట్లే. ఇక తప్పని సరిగా నగదు లేక చెక్కులతో లావాదేవీలు చేయక తప్పదు. అందుకే నెట్ బ్యాంకింగ్‌లో 'వన్ టైం పాస్‌వర్డ్' మీ సెల్‌కి ఇంకా మీ ఇమెయిల్‌కి పంపే సదుపాయం అన్ని బ్యాంకులు సత్వరం కల్పించాలి. ఈ సదుపాయం ప్రస్తుతం బ్యాంకు ఆఫ్ బరోడాలోనే పాటిస్తున్నారు. దీనిని అన్ని బ్యాంకుల్లో అమలు చేయాలి. ముఖ్యంగా భారతీయ స్టేట్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంకుల్లో అమలు చేయాలి. పనిమీద విదేశాలకు వెళ్లేవారు నెట్ బ్యాంకింగ్‌ను ఉపయోగించుకోలేకపోతున్నారు. బ్యాంకులో ఎంత బాలెన్స్ ఉన్నా అత్యవసరానికి చిన్న అమౌంట్ కావాలన్నా మిత్రులపైనో, చుట్టాలపైనో ఆధారపడాల్సి వస్తోంది. నెట్ బ్యాంకింగ్‌కి జత చేసిన సెల్ నెంబర్ ఆయా దేశాల్లోని నిబంధనలకు అనుగుణంగా మార్చుకునేందుకు ఎంతో సమయం, సొమ్ము ఖర్చు చేయాలి, కొన్ని దేశాలలో ఆ సదుపాయం కూడా ఉండదు. దీనిని దృష్టిలో పెట్టుకుని బ్యాంకులు వ్యవహరించాలి.

సి.వి.రామకృష్ణ

గ్రామీణ తపాలా ఉద్యోగుల బాధలు పట్టించుకోండి

దేశంలో మొత్తం పోస్టాఫీసుల సంఖ్య లక్ష యాభై నాలుగు వేల తొమ్మిది వందల అరవై ఐదు. నాలుగు లక్షల పదహారు వేల ఎనభై మూడు వందల ఉద్యోగులు ఉన్నారు గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న "గ్రామీణ డాక్ సేవ" ఉద్యోగులు దాదాపు రెండు లక్షల ముప్పై ఏడు వేల నాలుగు వందల మంది పని చేస్తున్నారు. ఇందులో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, ప్యాకర్స్, మెయిల్ కొరియర్ లాంటి ఉద్యోగులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వారికి శాశ్వత ఉద్యోగుల మాదిరిగా జీతాల పెంపు ఉండదు. వారికి ప్రత్యేక వేతన ఒప్పందాలు ఉంటాయి. వీరికి శ్రమ భారం కూడా ఎక్కువే. ప్రస్తుతం బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులలో ఆర్‌ఐసిటి దర్పణ కంప్యూటర్ పరికరాలతో ఆర్‌డీలు, పొదుపు ఖాతాలు, సుకన్య సమృద్ధి పథకం, జీవిత భీమా, పిఒటి పరికరంతో వృద్ధుల పింఛన్, వితంతు పింఛన్, వికలాంగుల పింఛన్, పోస్టల్ బ్యాంక్ ద్వారా ఉపాధి హామీ పథకం లబ్దిదారులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. ఇవన్నీ ఇంటర్నెట్ ద్వారా జరగవలసిన పనులే. పని వేళల్లో ఇంటర్నెట్ సంకేతాలు గ్రామీణ ప్రాంతాల్లో సరిగా లేనందువల్ల ప్రజలతో పాటు సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంకేతాలు సరిగా లేనందువల్ల పరికరాన్ని తెరవడానికి గంటల తరబడి వేచిచూసే పరిస్థితులు ఉన్నాయి. దీనివల్ల పని సాగడం లేదు. దీంతో సిబ్బందే కాదు ప్రజలూ ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సాధక బాధ కాలపై అధికారులు దృష్టిపెట్టాలి, వాటిని పరిష్కరించాలి. పని సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలి.

అళవందార్ వేణు మాధవ్

భారత్‌లో తగ్గుతున్న ఉద్యోగ లభ్యత

ఐ. ప్రసాదరావు

భారతదేశంలో అనాదిగా ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రంగం వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలే. ఇలాంటి రంగం ఇప్పుడు కుదేలైంది. అల్ప ఉపాధి, ప్రచ్ఛన్న నిరుద్యోగం ఈ రంగాన్ని వెంటాడుతోంది. బెంగళూరులోని అజీజ్ ప్రేమ్ జీ యూనివర్సిటీలో పనిచేస్తున్న "అమిత్ బోస్లే" నివేదిక ప్రకారం మూడు దశాబ్దాలుగా వ్యవసాయ రంగంలో ఉపాధి అవ కాశాలు తగ్గుతున్నాయి. 1993-94 మధ్యకాలంలో 62% శాతం జనాభా వ్యవసాయ రంగంలోనే ఉపాధి అవకాశాలు పొందేవారు. తదుపరి కొంత మంది చదువుకుని ఇతర రంగాలలో చిన్న చిన్న వేతనాలు సంపాదించుకునే పనుల్లోకి వెళ్ళారు. జాతీయ గణాంక కార్యాలయం ఉపాధి-నిరుద్యోగం నివేదిక ప్రకారం వ్యవసాయ రంగంలో 1993 నుంచి 2019 మధ్య కాలంలో శ్రమశక్తి 62% శాతం నుంచి 41.4% శాతం తగ్గింది. వాస్తవంగా చెప్పా లంటే కేవలం 34% జనాభాకు మాత్రమే ఉపాధి అవకాశాలు ఉంటున్నాయి. మిగిలిన వారికి ఇతర పనులు లేక వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు. దీనికి తోడు కోవిడ్ కాలంలో లాక్‌డౌన్ ప్రకటించడంతో దేశంలోని వివిధ ప్రదేశాలలో పనులు చేస్తున్న కార్మికులు బ్రతుకు జీవుడా అంటూ వలసబాట పట్టి, సొంత ప్రాంతాలకు చేరి వ్యవసాయ పనుల్లో కుదురుకున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో ఇతర రంగాలైనా బలంగా ఉండాలి. కానీ ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉంది. ఈ వ్యవస్థ మన దేశంలో బలహీనతగా ఉండుట వలన నిరుద్యోగం పెరుగుతోంది. ఆదాయాలు క్షీణించడం మొదలైంది. తయారీ రంగం, గనుల తవ్వకం వంటి రంగాలు పుంజుకోవాలి. ఇటీవల కాలంలో కొత్త పరిశ్రమల స్థాపనలు లేవు. పవర్ హాలిడే, పన్నుల భారం తదితర కారణాల వలన ఉన్న పరిశ్రమలూ చాలా మూతపడ్డాయి. దీంతో కార్మికుల చూపు నిర్మాణ రంగం వైపు మరలింది. అయితే పనికి తగ్గ వేతనాలు, సౌకర్యాలు లేక నిరుద్యోగంతో బాధపడుతున్నారు. నిత్యావసర వస్తువులు కూరగాయల ధరల విపరీత పెరుగుదలతో బతుకులు చిందర వందర అవుతున్నాయి.

సేవల రంగంలో సమాచార సాంకేతిక రంగం కొంత మెరుగ్గా ఉంది. దేశంలోని ఐదు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు టాటా కన్సల్టెన్సీ, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సిఎల్, టెక్ మహీంద్రా హవా నడుస్తోంది. ఈ కరోనా కాలంలో సుమారు 36% ఉద్యోగాలు పెరిగాయి. 125 లక్షల ఉద్యోగాల నుంచి 141 లక్షల ఉద్యోగాలు పెరిగాయి. అదే స్థాయిలో వేతనాలు పెరుగుట కొంచెం ఊరట లభించింది. రైల్వే ఉద్యోగాలు, త్రివిధ దళాల సిబ్బందితో సరి సమానంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పెరుగుట గమనార్హం. దీంతో సాఫ్ట్‌వేర్ ఎగుమతులు 2019-20లో 84.64 బిలియన్ల అమెరికా డాలర్లు మేర, 2021-22లో 109.54 బిలియన్ల అమెరికా డాలర్లు మేర జరిగాయి.

ఇక నుంచైనా ప్రభుత్వాలు ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేయాలి. ఉపాధి అవకాశాలు కల్పిం చాలి. దిగుమతులు తగ్గించుకోవాలి. ధరలు నియంత్రణ చేపట్టాలి. ఉచితాలకు స్వస్తి పల కాలి. ప్రభుత్వ రంగానికి ఎక్కువ నిధులు మంజూరు చేయాలి. వ్యవసాయ, చేనేత రంగా న్ని ప్రోత్సహించాలి. విద్య వైద్య ఖర్చుల భారం ప్రజలపై లేకుండా చూడాలి. ఈ రెండు రంగా లకూ అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయింపులు చేయాలి. నైపుణ్యాల అభివృద్ధికి పెద్ద పీట వేయాలి. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందుబాటులో ఉంచాలి. అప్పుడు మాత్రమే ప్రజల జీవితాలు, తలసరి ఆదాయం పెరుగు తాయి. అన్ని రంగాలను బలోపేతం చేయడం ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడి భవిష్యత్తు బాగుంటుందని ఆశిద్దాం.

సాఫ్ట్‌వేర్ రంగం మినహా, మిగిలిన రంగాలు ముఖ్యంగా తయారీ రంగం పరిశ్రమలు అనుకున్నంత స్థాయిలో ఉద్యోగాలు కల్పించుట లేదు. దీనికి ప్రధాన కారణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు రాకపోవడమే. పైపెచ్చు ప్రభుత్వాలు ఇప్పుడు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. "హర్ ఘర్ తిరంగ్" కోసం మన జాతీయ జెండాలు ఇతర దేశాల నుంచి ముఖ్యంగా చైనా నుండి దిగుమతి చేసుకోవడం తాజా ఉదాహరణ. ఒకపక్క వ్యవసాయ రంగం, మరోపక్క పారిశ్రామిక రంగం క్షీణించడం, ఇంకోవైపున కరోనా, మంకీ ఫాక్స్ వంటి అనారోగ్యాల మధ్య దేశంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక చరిత్ర ఎన్నడూ చూడని విధంగా నిరుద్యోగం తారస్థాయికి చేరుకుంది. ధరలు పెరిగి సామాన్య ప్రజల నడ్డి విరిగే దుస్థితి దేశంలో ఉంది. దీనికి తోడు ఈ 5 సంవత్సరాల కాలంలో సుమారు పది వేల పైబడిన బడా పారిశ్రామిక సంస్థలు, వేత్తలు సుమారు 10 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకులు నుంచి తీసుకున్న ఋణాలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయారు. ప్రజల సొమ్మును తినేసి, బ్యాంకులను బురిడీ కొట్టించి, దేశాన్ని దివాలా తీయిస్తున్నారు. ఇటు కేంద్ర ప్రభుత్వం, అటు వివిధ రాష్ట్రాలు అప్పులు ఊబిలో కూరుకు పోయి, వచ్చిన ఆదాయం వడ్డీలకు చెల్లించే పరిస్థితి ఏర్పడింది. భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇక నుంచైనా ప్రభుత్వాలు ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేయాలి. ఉపాధి అవకాశాలు కల్పించాలి. దిగుమతులు తగ్గించుకోవాలి. ధరలు నియంత్రణ చేపట్టాలి. ఉచితాలకు స్వస్తి పలకాలి. ప్రభుత్వ రంగానికి ఎక్కువ నిధులు మంజూరు చేయాలి. వ్యవసాయ, చేనేత రంగాన్ని ప్రోత్సహించాలి. విద్య వైద్య ఖర్చుల భారం ప్రజలపై లేకుండా చూడాలి. ఈ రెండు రంగాలకూ అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయింపులు చేయాలి. నైపుణ్యాల అభివృద్ధికి పెద్ద పీట వేయాలి. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందుబాటులో ఉంచాలి. అప్పుడు మాత్రమే ప్రజల జీవితాలు, తలసరి ఆదాయం పెరుగుతాయి. అన్ని రంగాలను బలోపేతం చేయడం ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడి భవిష్యత్తు బాగుంటుందని ఆశిద్దాం.

వ్యాస రచయిత సెల్ 6305682733

అధ్యక్ష పీఠంపై రాహుల్ విముఖత!

- సోనియానే కొనసాగాలంటున్న నేతలు
- వర్కింగ్ ప్రెసిడెంట్‌ను నియమించాలని సూచన
- కాంగ్రెస్ శ్రేణుల్లో గందరగోళం

న్యూదిల్లీ: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని రాహుల్ గాంధీ చేపడతారా లేదా అన్న విషయమై ఆ పార్టీ నేతల్లో గందరగోళం నెలకొంది. ఎందుకంటే రాహుల్ గాంధీ ఈ విషయంలో స్పష్టత నివ్వలేదు. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ మాట్లాడుతూ... పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యుసీ) అధ్యక్షుడి ఎన్నిక తేదీ, షెడ్యూల్‌ను నిర్ణయిస్తుందని తెలిపారు. 'ప్రతినిధుల జాబితా (ఓటు వేసే వారు) సిద్ధంగా ఉంది. మా వైపు నుండి, మేము సిద్ధంగా ఉన్నాము, ఇది సీడబ్ల్యుసీ తేదీని నిర్ణయించాల్సి ఉంది' అని ఆయన పీటీఐకి తెలిపారు. రాహుల్ గాంధీ సన్నిహితులు సహా పార్టీలో చాలామంది పార్టీ నాయకులు, కార్యకర్తల కోరికను మన్నించి రాహుల్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అనే దానిపై గట్టిగా ఎవరూ చెప్పడంలేదు. అయితే కొద్దిరోజుల క్రితం వరకు పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టకూడదన్న ఆయన వైఖరి మారలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాహుల్ గాంధీ మళ్లీ అధ్యక్షుడ వ్వాలని పార్టీలోని చాలా మంది కోరుకుంటున్నారని, అయితే ఈ విషయంలో ఆయన తన వైఖరిని మార్చుకున్నట్లు ఎలాంటి సూచనలు లేవని పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు.

ఒకవేళ రాహుల్ గాంధీ అధ్యక్ష పదవికి అంగీకరించని పక్షంలో సోనియాగాంధీనే అధ్యక్షురాలిగా కొనసాగాలనే ఆలోచన కూడా పార్టీలో వ్యక్తమవుతోంది. అదే గనుక జరిగితే ఆమెకు రోజువారీ కార్యకలాపాల్లో ఇద్దరు సీనియర్ నాయకులు సహాయం చేసే అవకాశం ఉంది. వారికి అధికారికంగా వర్కింగ్ ప్రెసిడెంట్ వంటి పాత్ర ఇవ్వవచ్చునని పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత చెప్పారు. ఈ విషయంపై వచ్చే వారంలోగా స్పష్టత వస్తుందని ఆ నేత తెలిపారు. రాజకీయ వ్యాఖ్యాత రషీద్ కిద్వాయ్ మాట్లాడుతూ భారతదేశంలో అన్ని పార్టీల అధ్యక్ష పదవికి జరిగే ఎన్నికలు కనిపించేంత ప్రజాస్వామ్య బద్ధం కాదని అన్నారు. 'కాంగ్రెస్ విషయానికొస్తే... ఇప్పుడు ఎన్నికైన వ్యక్తి 2027 వరకు అధ్యక్షుడిగా ఉంటారు. రెండవ అంశం ఏమిటంటే, ఈడీ దాడులతో వేధింపు రాజకీయాలు సాగుతున్న నేపథ్యంలో గాంధీలను తమను తాము రక్షించుకునేలా వదిలేయలేయలేమని, వారిలో ఒకరు అధికారంలో కొనసాగితే వారిపై ఇటువంటి చర్యలకు పూనుకోవడం కష్టమవుతుందని పార్టీ నాయకులు భావిస్తున్నారు ' అని కిద్వాయ్ పీటీఐకి చెప్పారు. రాహుల్ గాంధీ విషయానికొస్తే... ఆయన పదవిని అంగీకరించకపోవడానికి సరైన కారణాలను చెప్పారన్నారు. దేశంలో ఒక విధమైన రాజవంశ వ్యతిరేకభావం కూడా ఉంది, తద్వారా ఆయనను బలహీన అభ్యర్థిగా మార్చారని కిద్వాయ్ అభిప్రాయపడ్డారు. సోనియాగాంధీ నాయకత్వంలో కొనసాగడం మంచిదని, ఇద్దరు ముగ్గురు వర్కింగ్ ప్రెసిడెంట్లను కూడా నియమించాలని కొందరు పార్టీ నాయకులు భావిస్తున్నారని పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ సెంటర్ ఫర్ పొలిటికల్ స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్ మణీంద్ర నాథ్ ఠాకూర్ మాట్లాడుతూ... 'సోనియా గాంధీ బయటకు వెళు న్నారు...ఆమెకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. రాహుల్ గాంధీతో ఉన్న సమస్య ఏమిటంటే, అతను పార్టీ చీఫ్ అయిన క్షణంలో ప్రత్యర్థుల నుండి దాడులకు గురవుతాడు. కుటుంబానికి మన్మోహన్ సింగ్ లాంటి నమ్మకమైన వ్యక్తి లేడు. అదే పార్టీ ఎదుర్కొంటున్న పెద్ద సమస్య' అని ఠాకూర్ పీటీకిచెప్పారు. పార్టీ అధ్యక్షుడిగా లేని కాలంలో రాహుల్ గాంధీ పనితీరు మెరుగుపడినప్పటికీ గాంధీ కుటుంబానికి నమ్మకమైన నాయకుడిని కనుగొనాల్సి ఉంటుందన్నారు. అయితే నాయకత్వం వారి చేతుల్లో నుండి పోయిన క్షణం అందరినీ ఐక్యంగా ఉంచడం చాలా కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. సోనియా గాంధీని అధ్యక్షురాలిగా ఉంచి, ఆమెకు సహాయం చేయడానికి కొంతమంది నాయకులు నియమించుకోవడమే ఏకైక పరిష్కారమని ఠాకూర్ అన్నారు. అయితే ఇది ప్రజలను ఉత్తేజపర్చదని, పార్టీకి అవసరమైన శక్తిని తీసుకురాదని కూడా ఠాకూర్ చెప్పారు. పార్టీ అధ్యక్ష పదవికి ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 20 మధ్య ఎన్నికలు జరుగుతాయని కాంగ్రెస్ ప్రకటించింది. అయితే ఈ ప్రక్రియ ప్రారంభం కావడానికి కొన్ని రోజులు మాత్రమే సమయం ఉండటంతో పార్టీ అధ్యక్ష పదవిని ఎవరు స్వీకరిస్తారన్న విషయమై పార్టీ శ్రేణుల్లో అనిశ్చితి నెలకొంది. రాహుల్ గాంధీ కాకపోతే ఎవరు? పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ ప్రశ్నపై పట్టుబడుతున్నారు. గాంధీ కుటుంబయేతర వ్యక్తిని అధ్యక్షుడిగా చేయడానికి సిద్ధమవుతున్నారు. అశోక్ గెహ్లాట్, మల్లికార్జున్ ఖర్గే, ముకుల్ వాస్నిక్, కుమారి సెల్జా వంటి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. 2019లో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ వరుసగా రెండో ఓటమిని చవిచూసిన తర్వాత రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. తాత్కాలిక అధ్యక్షురాలిగా మళ్లీ పార్టీ పగ్గాలు చేపట్టిన సోనియా గాంధీ కూడా ఒక వర్గం బహిరంగ తిరుగుబాటుతో 2020 ఆగస్టులో వైదొలగుతానని ప్రతిపాదించారు. కానీ సీడబ్ల్యుసీ ఆమెను కొనసాగాలని కోరింది. రాహుల్ గాంధీని మళ్లీ పార్టీ అధ్యక్షుడిగా చేయాలని కొంతమంది నాయకులు బహిరంగంగా పిలుపునిచ్చినప్పటికీ పార్టీ అధ్యక్ష పదవిపై అనిశ్చితి, ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.

నగల దోపిడీలో ట్విస్ట్... ఇన్‌స్పెక్టర్ ఇంట్లో బంగారం

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలో గతవారం ఓ ఆభరణాల రుణ సంస్థలో భారీ దోపిడీ జరిగింది. పట్టపగలు అందరూ చూస్తుండగానే సంస్థ ఆఫీసులోకి చొరబడిన దుండగులు సిబ్బందిని బెదిరించి రూ.20కోట్ల విలువైన నగలను ఎత్తుకెళ్లారు. అయితే ఈ కేసు ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. దోపిడీ చేసిన నగల్లో కొన్ని స్థానిక ఇన్‌స్పెక్టర్ ఇంట్లో లభించడం కలకలం రేపుతోంది. ఈ కేసును దర్యాప్తు చేస్తోన్న పోలీసులు ఇన్‌స్పెక్టర్ ఇంటి నుంచి 3.7 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ) ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెన్నైలోని అరుంబాక్కంలో ఓ బ్రాంచ్ ఉంది. ఆగస్టు 13 మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో ఈ బ్రాంచీలోకి కొందరు దుండగులు చొరబడ్డారు. సిబ్బంది, కస్టమర్లను కత్తులతో బెదిరించి తాళ్లతో కట్టేశారు. ఆపై రూ.20కోట్ల విలువైన నగలు, నగదును దోచుకెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఫెడ్‌బ్యాంకులో పనిచేసే వ్యక్తులే దోపిడీకి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రధాన నిందితుడిగా మురుగున్ అనే వ్యక్తి ఉన్నట్లు అనుమానించారు. నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఘటన జరిగిన మరుసటి రోజే సంతోష్, బాలాజీ అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.8.5కోట్ల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత రోజు మురుగున్, మరో వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. అయితే విచారణలో నిందితుడు సంతోశ్ కీలక సమాచారమిచ్చాడు. తాను దోచుకున్న నగల్లో కొన్నింటిని అచరపాక్కమ్ ఇన్‌స్పెక్టర్ అమల్‌రాజ్ ఇంట్లో దాచిపెట్టినట్లు తెలిపాడు. అంతేగాక, నిందితుడు సంతోష్.. అమల్‌రాజ్ భార్యకు బంధువు కావడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. గురువారం ఇన్‌స్పెక్టర్ ఇంట్లో సోదాలు జరపగా 3.7కిలోల బంగారు ఆభరణాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో అమల్‌రాజ్, ఆయన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఈ దోపిడీతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఇన్‌స్పెక్టర్ చెబుతున్నారు. ఘటన జరిగిన రాత్రి సంతోశ్ తమ ఇంటికి వచ్చాడని, అతడి వద్ద బంగారం ఉన్నట్లు తమకు తెలియదన్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఏర్పాటుకు శ్రమపడక్కర్లేదు: మోదీ

న్యూదిల్లీ : దేశం గురించి పట్టించుకోనివారు, ఆ దేశం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. గడచిన ఎనిమిదేళ్లల్లో ఎన్డీయే ప్రభుత్వం చేసిన కృషిని వివరించారు. పనాజీలో శుక్రవారం జరిగిన ఇంటింటా తాగునీటి ఉత్సవంలో ఆయన వర్చువల్ విధానంలో పాల్గొని, మాట్లాడారు. జల జీవన్ మిషన్ కింద గడచిన మూడేళ్లల్లో తన ప్రభుత్వం దాదాపు ఏడు కోట్ల గ్రామీణ కుటుంబాలకు కొళాయి నీటిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు, నీటి కనెక్షన్లను ఇచ్చిందని చెప్పారు. గ్రామాల్లో ఈ పథకం కింద ఇప్పటి వరకు 10 కోట్ల కనెక్షన్లను ఇచ్చినట్లు చెప్పారు. దేశ నిర్మాణానికి శ్రమించడం తప్పనిసరి అని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి పెద్దగా శ్రమపడాల్సిన అవసరం లేదని, అయితే దేశాన్ని నిర్మించడానికి కఠోర శ్రమ తప్పనిసరి అని తెలిపారు. తాము దేశ నిర్మాణ మార్గాన్ని ఎంచుకున్నామన్నారు. అందుకే తాము ప్రస్తుత, భవిష్యత్తు సమస్యలను, సవాళ్లను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. దేశం గురించి పట్టించుకోనివారు దేశం ఎదుర్కొంటున్న, ఎదుర్కొనబోతున్న సవాళ్లను కూడా పట్టించుకోరన్నారు. అలాంటివారు నీటి గురించి పెద్ద పెద్ద మాటలు చెబుతారని, ఆ మాటలను అమలు చేసేందుకు గొప్ప దార్శనికతతో పనిచేయరని అన్నారు. గోవాలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే అన్ని కుటుంబాలకు (నూటికి నూరు శాతం కుటుంబాలకు) కొళాయి నీటిని అందజేయాలన్న లక్ష్యం సాకారమైనందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

వీడియో లింక్ ద్వారా మోదీ మాట్లాడారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కేంద్ర జల శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పనాజీలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

వివాదంలో లాలు కుటుంబం

ప్రభుత్వ కార్యక్రమంలో అల్లుడు

పాట్నా: మరోసారి లాలూ ప్రసాద్ కుటుంబం వివాదంలో చిక్కుకుంది. బీహార్ పర్యావరణ మంత్రి తేజ్ ప్రతాప్ అధికారిక సమావేశంలో లాలూ ప్రసాద్ అల్లుడు హాజరవ్వడం పెద్ద వివాదానికి దారితీసింది. ఈ మేరకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మంత్రి వర్గంలో మంత్రి తేజ్ ప్రతాప్‌కు సంబంధించిన శాఖపరమైన సమావేశానికి లాలూ ప్రసాద్ పెద్ద అల్లుడు కూడా హాజరయ్యారు. అందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ఆర్జేడీ పై అధికార పార్టీ బీజేపీ విమర్శల దాడి చేసింది. వాస్తవానికి తేజ్ ప్రతాప్ ఆగస్టు 16న మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన అదే రోజున ఆయనకు కేటాయించిన పర్యావరణం, అటవీ వాతావరణ మార్పుల శాఖ బాధ్యతలు చేపట్టారు. ఐతే ఆగస్టు 17న అరణ్య భవన్‌లో అటవీ వాతావరణ మార్పుల శాఖ సమీక్ష సమావేశానికి తేజ్ ప్రతాప్ అధ్యక్షత వహించారు. అప్పుడు జరిగిన అధికారుల సమావేశానికి లాలూ ప్రసాద్ పెద్ద అల్లుడు శైలేశ్ కుమార్ కూడా వచ్చారు. ఆ తర్వాత ఆగస్టు 18న బీహార్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులతో కూడా తేజ్ ప్రతాప్ మరోసారి సమావేశమయ్యారు. ఆ సమావేశానికి కూడా శైలేశ్ రావడమే కాకుండా ఆయనతోపాటు కలిసి కూర్చోవడంతో పెద్ద దూమారం రేగింది. దీంతో బీజేపీ పెద్ద ఎత్తున విమర్శలు ఎక్కుపెట్టింది. 'తేజ్ ప్రతాప్‌ని ఎవ్వరూ తేలిగ్గా తీసుకోకండి. ఎందుకంటే మంత్రులందరిలోనూ ఆర్జేడీ కోటా కుమారుడు శైలేశ్ యాదవ్ అత్యంత తెలివైనవాడు. అతని ఆశీస్సులు తేజ్ ప్రతాప్‌కు ఉంటే ఉత్తమ మంత్రిగా ఎదుగుతాడు' అని ఎద్దేవా చేస్తూ బీజేపీ అధికార ప్రతినిధి శైలేశ్‌ని ఉద్దేశించి విమర్శిస్తూ ట్వీట్ చేశారు.

అవన్నీ డబ్బులిచ్చి రాయించుకున్న కథనాలే: బీజేపీ

న్యూదిల్లీ: ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని దిల్లీ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యావిధానంపై న్యూయార్క్ టైమ్స్ ఖలీజ్ టైమ్స్ రాసిన కథనాలు డబ్బులిచ్చి రాయించుకున్నవేనని బీజేపీ ఆరోపించింది. దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఇంట్లో సీబీఐ సోదాల నేపథ్యంలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ కథనాల గురించి ప్రస్తావిస్తూ సిసోడియాను ఉత్తమ విద్యా శాఖ మంత్రిగా ప్రశంసించారు. దీంతో బీజేపీ ఘాటుగా స్పందించింది. బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ శుక్రవారం ఇచ్చిన ట్వీట్‌లో, న్యూయార్క్ టైమ్స్, ఖలీజ్ టైమ్స్ ఒకే కథనాన్ని ఏ విధంగా ప్రచురించాయని ప్రశ్నించారు. ఈ రెండు పత్రికల్లోనూ రాసిన కథనాలను ఒకే వ్యక్తి రాశారని, ఒకే రకమైన బొమ్మలను పెట్టారని, వీటిల్లో వాడిన పదాలు కూడా ఒకటేనని చెప్పారు. ఆ బొమ్మలు కూడా ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందినవన్నారు. అసలు దిల్లీలో లేని విద్యా విధానంపై ఈ కథనాలను రాశారన్నారు. అరవింద్ కేజ్రీవాల్ తనను తాను కాపాడుకోవడానికి చెబుతున్నదంతా పెయిడ్ ప్రమోషన్ (డబ్బు చెల్లించి ప్రచారం చేసుకోవడం) తప్ప మరొకటేమీ కాదన్నారు.

బీజేపీ దిల్లీ విభాగం ఐటీ సెల్ ప్రతినిధి పునీత్ అగర్వాల్ ఇచ్చిన ట్వీట్‌లో, న్యూయార్క్ టైమ్స్, ఖలీజ్ టైమ్స్ పత్రికల్లో కచ్చితంగా ఒకే విధమైన వ్యాసాలు ఏ విధంగా వచ్చాయని ప్రశ్నించారు. ఒకే మాటలు, ఒకే బొమ్మలు, ఒకే వ్యాసకర్త ఎలా వచ్చారన్నారు. "ఇది వార్త కాదు కేజ్రీవాల్ గారూ, దీనిని పెయిడ్ అడ్వర్టయిజింగ్ అంటారు. మనీశ్ సిసోడియా ఆయనకు తగిన చోటుకు వెళ్తారు, అది జైలు" అని హెచ్చరించారు.

లింగాయత్‌ల వెంట పార్టీలు...!

- 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వారి ఓట్ల కోసం ఆరాటం
- కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ప్రయత్నాలు
- కర్ణాటకలో బుజ్జగింపులు... పదవుల ఎర

బెంగళూరు : కర్ణాటక రాష్ట్రంలో రాజకీయ పార్టీలు కుల మద్దతును కూడగట్టేందుకు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కీలక సామాజికవర్గంగా ఉన్న లింగాయత్‌ల వెంట పడుతున్నాయి. పక్షం రోజుల్లోనే, అధికార బీజేపీ, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బలమైన వీరశైవ లింగాయత్ వర్గాన్ని ప్రసన్నం చేసుకునేందుకు బలమైన సంకేతాలను పంపేందుకు ప్రయత్నించాయి. బుధవారం బీజేపీ.... మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడ్యూరప్పను పార్టీ పార్లమెంటరీ బోర్డు, కేంద్ర ఎన్నికల కమిటీకి ఎంపిక చేసింది. అంతకుముందు, చిత్రదుర్గలోని మురుఘా మఠంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ 'లింగధారణ' కార్యక్రమం చేపట్టారు. ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన ఏడాదికి పైగా కాలం తర్వాత లింగాయత్‌కు చెందిన బలమైన నాయకుడిని తిరిగి పార్టీలో కీలక బాధ్యతల్లో కూర్చోబెట్టడం ద్వారా బీజేపీ ఆ సామాజిక వర్గం మనోభావాలను శాంతిపజేసే ప్రయత్నం చేస్తోంది. 2017లో ప్రత్యేక లింగాయత్ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలనే దాని చర్యపై కాంగ్రెస్ సర్దుకుపోతున్నట్లు కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ సామాజిక వర్గ ప్రజలకు అది అంతగా నచ్చలేదు. వీరశైవ లింగాయత్‌లలో ఎక్కువ మంది ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీతో ఉన్నారని విశ్వసిస్తున్నప్పటికీ, దాదాపు ఎనిమిది నెలల వ్యవధిలో శాసనసభకు ఎన్నికలు జరగనుండగా, కుంకుమ పార్టీ నుంచి 'నిశ్చయించని ఓటర్ల'ను దూరం చేసేందుకు కాంగ్రెస్ రాజకీయంగా ఆధిపత్య వర్గాన్ని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. అఖిల భారత వీరశైవ మహాసభ ద్వారా వీరశైవ లింగాయత్‌లను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్, శక్తివంతమైన ఉపవర్గం అయిన పంచమశాలీల 2ఏ రిజర్వేషన్ డిమాండ్ నేపథ్యంలో బీజేపీకి చుక్కెదురైంది. రాజకీయంగా వీరశైవ-లింగాయత్‌లకు ప్రాముఖ్యత ఉంది. 2018 ఎన్నికలలో ఎన్నికయిన 224 మంది శాసనసభ్యులలో 58 మంది శాసనసభ్యులు ఆ సామాజిక వర్గానికి చెందిన వారే కావడం విశేషం. 58లో 38 మంది బీజేపీకి, 16 మంది కాంగ్రెస్‌కు, నలుగురు జనతాదళ్ (సెక్యులర్)కి చెందినవారు. కాగా '135 నియోజకవర్గాలలో ఎన్నికల రాజకీయాలలో ఈ సామాజిక వర్గం చెప్పుకోదగినది. ఉత్తర కర్ణాటకలో ఒకే వర్గానికి చెందిన రాజకీయ ప్రత్యర్థులు ఉన్న చోట ఈ సామాజిక వర్గం ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణ కర్ణాటకలో ఎన్నికల ఫలితాలపై ఆ సామాజిక వర్గం ప్రభావం నిర్ణయాత్మకం అవుతుంది' అని మహాసభ కార్యదర్శి హెచ్‌ఎం రేణుకాప్రసన్న అన్నారు. అయితే, డీలిమిటేషన్ కసరత్తు తర్వాత 2008 ఎన్నికల తర్వాత తమ రాజకీయ పలుకుబడి తగ్గిపోయిందని వీరశైవ లింగాయత్‌లు భావిస్తున్నారు. గతంలో లింగాయత్ శాసనసభ్యులు ప్రాతినిధ్యం వహించిన 22 నియోజకవర్గాలు రిజర్వ్ అయినవి లేదా ఉపసంహరించినట్లు మహాసభ రూపొందించిన జాబితా చూపిస్తుంది. సగటున, 2008కి ముందు ప్రతి అసెంబ్లీలో 70 మంది లింగాయత్ శాసనసభ్యులు ఎన్నికయ్యారు. 1967లో అత్యధికంగా 90 మంది లింగాయత్ శాసనసభ్యులు ఉన్నారు. 2013లో బీజేపీకి వ్యతిరేకంగా పోటీ చేయడానికి యడ్యూరప్ప కేజేపీని స్థాపించినప్పుడు అసెంబ్లీలో అత్యల్ప సంఖ్యలో లింగాయత్‌లు ఉన్నారు. 48 లింగాయత్ శాసనసభ్యులు ఎన్నికయ్యారు. ఇదిలాఉండగా, కాంగ్రెస్‌కి చెందిన లింగాయత్ నాయకుడు ఒకరు మాట్లాడుతూ 'నియోజకవర్గాల్లో కూడా లింగాయత్‌ల ప్రభావం వల్ల పార్టీలు లాభపడతాయి. ముఖ్యంగా ఉత్తర కర్ణాటకలో ఇది ఎక్కువ. ఇక, కనీసం 20 నియోజకవర్గాల్లో వొక్కలిగలు ఒకరితో ఒకరు పోటీపడుతున్న దక్షిణ కర్ణాటకలో లింగాయత్‌ల ఓట్లు గణనీయమైన సంఖ్యలో నిర్ణయాత్మకంగా మారాయి' అని తెలిపారు. అయితే మహాసభ అందించిన సమాచారం ఆసక్తిదాయకంగా ఉంది. 2018లో మొత్తం రిజర్వ్‌డ్ నియోజకవర్గాలలో 43 శాతం బీజేపీ గెలుచుకుంది. ఎస్సీలకు రిజర్వ్ అయిన 35 నియోజకవర్గాలలో 15, ఎస్టీలకు రిజర్వ్ అయిన 16లో ఏడు స్థానాలు గెలుచుకుంది. దీనికి విరుద్ధంగా, 2013లో కేజేపీ వల్ల ప్రభావితమైన బీజేపీ మొత్తం రిజర్వ్‌డ్ సీట్లలో దాదాపు 16 శాతం, ఏడు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు, ఒక ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాన్ని గెలుచుకుంది. తుమకూరు, హాసన్, మాండ్య, చామరాజనగర్, రామనగరం, మైసూరు జిల్లాల్లో గణనీయమైన సంఖ్యలో లింగాయత్‌లు ఉన్న నియోజకవర్గాలు ఉన్నాయని, ఇక్కడ అటువంటి ప్రభావం ఉందని రేణుకాప్రసన్న తెలిపారు. 'దక్షిణాదిలో లింగాయత్ ఏకీకరణ పాత మైసూర్ ప్రాంతంలో బలహీనంగా ఉన్న బీజేపీకి లేదా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండవలసిన అవసరం లేదు. కానీ రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా జేడీ(ఎస్)కి కూడా అనుకూలంగా వెళ్లవచ్చు' అని వివరించారు.

సైన్యంలో చేరలేకపోయా: రాజ్‌నాథ్

ఇంఫాల్: సైన్యంలో చేరి దేశ సేవ చేయాలని తాను చిన్ననాటి నుంచి కలలు కన్నానని, అయితే కుటుంబ పరిస్థితుల కారణంగా చేరలేకపోయానని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. మణిపూర్‌లో పర్యటిస్తోన్న ఆయన.. అక్కడి ఇన్‌స్పెక్టర్ జనరల్ అస్సాం రైఫిల్స్(దక్షిణ) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. అస్సాం రైఫిల్స్, రెడ్ షీల్డ్ డివిజన్ బృందాలను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన తన వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు. తన జీవితంలో జరిగిన ఓ సంఘటనను మీతో పంచుకోవాలనుకుంటున్నానని, తనకు చిన్ననాటి నుంచి ఆర్మీలో చేరాలనే కోరిక ఉండేదని, అందుకు సన్నద్ధమయ్యానని రాజ్‌నాథ్ చెప్పారు. ఒకసారి రాత పరీక్షకు హాజరయ్యానని, అయితే కుటుంబంలో ఎదురైన అనుకోని పరిస్థితులు, తన తండ్రి మరణంతో సైన్యంలో చేరలేకపోయానని చెబుతూ రాజ్‌నాథ్ భావోద్వేగానికి గురయ్యారు. సైనికుల శౌర్యపరాక్రమాలను రాజ్‌నాథ్ కొనియాడారు. తాను ఎక్కడికి వెళ్లినా కచ్చితంగా అక్కడి జవాన్లను కలుస్తానని, దేశ రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సైనికులను కలవడం ఎంతో గర్వంగా ఉంటుందన్నారు. డాక్టర్లు, ఇంజినీర్లు, ఛార్టెడ్ అకౌంటెంట్లు దేశానికి ఓ మార్గంలో సేవ చేస్తున్నారని, కానీ, మీరు నిర్వహించే బాధ్యతలు ఓ వృత్తి కంటే, సేవ కంటే ఎంతో ఎక్కువని కేంద్రమంత్రి ప్రశంసించారు.

ముంబైలో కుప్పకూలిన నాలుగంతస్తుల భవనం

ముంబై: మహారాష్ట్రలోని ముంబైలో నాలుగంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. భవనం నేలకూలిపోతున్న సమయంలో శబ్దాలు రావడంతో స్థానికులు భయంతో పరుగులు పెట్టారు. అయితే, ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని సమాచారం. ఇది శిథిలమైన భవనం కావడంతో ఖాళీగా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. శిథిలావస్థకు చేరిన భవనం అయినా అకస్మాత్తుగా కూలిపోవడం కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ భవనం శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారేమోనని పరిశీలిస్తున్నారు. సహాయక చర్యల కోసం ఘటనా స్థలంలో ఎనిమిది అగ్నిమాపక యంత్రాలు, రెండు రెస్క్యూ వ్యాన్‌లు, మూడు అంబులెన్స్‌లను మోహరించారు.

అవమానంతో చితికిపోయా

ఓ మహిళా ప్రొఫెసర్ ఆవేదన

కోల్‌కతా: బికినీ ధరించి ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు పెట్టిన కారణంగా ఓ మహిళా ప్రొఫెసర్ ఉద్యోగం కోల్పోయారు. ఈ వార్త సామాజిక మాధ్యమంలో బాగా వైరల్ అయింది. ఈ ఘటన అక్టోబర్‌లో జరిగినప్పటికీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీని కారణంగా ఆ మహిళ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వచ్చింది. తనకు జరిగిన అవమానాన్ని ఆ ప్రొఫెసర్ మీడియా ముందు ఆవేదన వెలిబుచ్చారు. విద్యాసంస్థ చేపట్టిన విచారణతో తానెంతో కుమిలిపోయానని తెలిపారు. గత అక్టోబర్‌లో విద్యాసంస్థ 'కంగారు కోర్టు'లో నిర్వహించిన విచారణ తనకు విరక్తి, భయాన్ని పుట్టించాయని, అవమానంతో చితికిపోయానని ఆ ప్రొఫెసర్ తెలిపారు. తన ఇన్‌స్టాగ్రాం చిత్రాలను ఉద్దేశించి తీవ్రంగా విమర్శించారని, ఎంపిక చేసిన కొంతమందికి మాత్రమే ఆ ఫొటోలను తాను ఇన్‌స్టాలో షేర్ చేశానన్నారు. వాటిపై తనను గంటపాటు విచారించారని, బలవంతంగా రాజీనామా చేసేలా ఒత్తిడి చేశారని ఆవేదన చెందారు. కోల్‌కతాలోని ప్రముఖ సెయింట్ జేవియర్స్ యూనివర్సిటీలో బీఏ ఇంగ్లిష్‌లో పట్టా పొందిన ఆమె.. తర్వాత ఎంఏ పూర్తి చేశారు. 2020లో యూరోపియన్ యూనివర్సిటీలో డాక్టరేట్ పొందారు. తర్వాత తాను చదివిన జేవియర్స్ యూనివర్సిటీలోనే గత ఆగస్టులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం పొందారు. ఈ ఉద్యోగంతో కరోనా వేళ కోల్‌కతాలోని తన కుటుంబానికి దగ్గరగా ఉండేందుకు అవకాశం ఏర్పడిందని ఆమె సంతోషించారు. తనకు ఇష్టమైన పాఠ్యాంశాలు బోధించేందుకు వీలు పడటంతో ఆనందపడ్డారు. అయితే చాలా త్వరగా ఈ ప్రయాణాన్ని దారుణంగా ముగించాల్సి వచ్చింది. అది ఇప్పటికీ కంపరమైన పీడ కలలాగే ఉంది. విచారణ సమయంలో వారు పేర్కొన్న ఫిర్యాదు తన వ్యక్తిత్వాన్ని తగ్గించి, తనను ఓ చెడు మహిళగా చిత్రీకరించింది. విచారణ సమయంలో ప్యానెల్‌లో ఐదుగురు మహిళలు ఉన్నారు. అది తనను ఇంకా బాధించింది. ఈ వార్త వెలుగులోకి వచ్చిన తర్వాత నుంచి తన చుట్టూ కొన్ని వ్యాఖ్యలు వినిపించాయి. వారు తొలగించేవరకు వేచి చూడకుండా ఎందుకు రాజీనామా చేశావని కొందరు తనను ప్రశ్నించారని, రాజీనామా చేయకపోతే.. ఈ చిత్రాలు ఉంచినందుకు క్రిమినల్ కేసు పెడతామని బెదిరించారని చెప్పారు. యూనివర్సిటీ ప్రాంగణంలో డ్రెస్ కోడ్‌కు సంబంధించి తాను ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని, ఇన్‌స్టా ప్రొఫైల్ కూడా ప్రైవేట్ ఖాతాయేనన్నారు. దాన్ని ఎవరో హ్యాక్ చేశారేమోనని, అందుకే ఆ ఫొటోలు లీకయ్యాయంటూ అదే నెలలో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనవసరంగా తనను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు.

పరారీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే... నేపాల్‌లో అరెస్టు

మోతిహారి: బీహార్ మాజీ ఎమ్మెల్యే రంజన్ తివారీ కోసం 20 సంవత్సరాలుగా వెతుకుతున్న పోలీసుల ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. ఉత్తరప్రదేశ్ పోలీసులపై కాల్పులు జరిపిన కేసులో రంజన్ తివారీ నిందితుడిగా ఉన్నారు. ఆయన తలపై రూ. 25 వేల రివార్డు కూడా ఉంది. ఆయన కోసం రెండు దశాబ్దాలుగా అలుపెరగకుండా గాలిస్తున్న పోలీసులకు ఎట్టకేలకు ఆయన ఇండియా-నేపాల్ సరిహద్దులోని రక్సౌల్‌లో పట్టుబడ్డారు. ఉత్తరప్రదేశ్, బీహార్ పోలీసులతో కూడిన బృందం ఆయనను అదుపులోకి తీసుకుంది. బీహార్‌లోని తూర్పు చంపారన్ జిల్లా గోవింద్‌గంజ్ మాజీ ఎమ్మెల్యే అయిన రంజన్ తివారీ 1998లో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో పోలీసులపై కాల్పులు జరిపారు. అనంతరం పరారైన ఆయన ఆచూకీ అంతుచిక్కుకుండా పోయింది. అయితే యూపీ పోలీసులు మాత్రం రెండు దశాబ్దాలుగా ఆయన కోసం గాలిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో ఆయన ఆచూకీ చెప్పిన వారికి రూ. 25వేల రివార్డు ఇస్తామని ప్రకటించారు. అయినప్పటికీ ఆయన ఆచూకీ తెలియరాలేదని ఈస్ట్ చంపారన్ ఎస్పీ కుమార్ ఆశిష్ తెలిపారు. రంజన్ తివారీ తాజాగా భారత్-నేపాల్ సరిహద్దులో పట్టుబడినట్టు చెప్పారు. ప్రాథమిక లాంఛనాలు పూర్తిచేసిన అనంతరం ఆయనను యూపీ పోలీసులకు అప్పగించినట్టు చెప్పారు. రంజన్ తివారీ రక్సౌల్ మీదుగా కఠ్మాండు పారిపోవాలని పథకం పన్నారని రక్సౌల్ ఎస్పీ చంద్ర ప్రకాశ్ తెలిపారు.

జాగ్రత్త... బీజేపీ వల వేస్తోంది: మమత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మంత్రులను ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమత బెనర్జీ హెచ్చరించారు. కేసుల్లో ఇరికించేందుకు బీజేపీ వల వేసిందని, అందరూ చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. స్టింగ్ ఆపరేషన్లు నిర్వహించే ప్రయత్నాలు జరుగుతాయని తెలిపారు. రకరకాలుగా 500 మందిని నియమించారని, కేసుల్లో ఇరికిస్తారని తెలిపారు. ఎల్లప్పుడూ జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. మమత బెనర్జీ గురువారం మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతూ, స్టింగ్ ఆపరేషన్లు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. బీజేపీ వల వేసి పట్టుకుని, కేసుల్లో ఇరికించే అవకాశం ఉందన్నారు. తెల్ల కాగితాలపై సంతకాలు చేయవద్దని కోరారు. మంత్రులంతా తమ ఆదాయపు పన్ను రిటర్నులను ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి ఐటీ రిటర్నులు చేరుకున్న తర్వాత రశీదులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మంత్రుల పనితీరును విడిగా నిర్ణయిస్తామన్నారు.

ఫైలును క్షుణ్ణంగా చదవకుండా సంతకాలు చేయవద్దని మంత్రులను కోరారు. సంతకం కింద, పైనా ఖాళీగా లేకుండా చూసుకోవాలన్నారు. ఖాళీ ఉంటే ఏదైనా రాయడానికి అవకాశం ఉంటుందన్నారు. మంత్రుల కార్లపై ఎరుపు, నీలం లైట్లపై నిషేధం విధించినట్లు తెలిపారు. కోల్‌కతాలో మంత్రులు పోలీస్ పైలట్‌ను తీసుకెళ్లరాదన్నారు. జిల్లాల నుంచి వచ్చే మంత్రులు కోల్‌కతాలో ప్రవేశించే ముందు పోలీస్ పైలట్‌ను వదిలిపెట్టాలన్నారు.

మోదీ సర్కార్‌కు ఆప్ లక్ష్యం?

సిసోడియా ఇంట్లో సీబీఐ సోదాలు

భయపడేది లేదంటున్న ఆప్ నేతలు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీపై మోదీ సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఢిల్లీలో అధికారం చేపట్టడమే కాకుండా ఇటీవల జరిగిన పంజాబ్ ఎన్నికల్లోనూ ఆప్ విజయం సాధించడం, తాజాగా గుజరాత్‌పై ఆప్ అధినేత కేజ్రీవాల్ దృష్టి కేంద్రీకరించడంతో బీజేపీ ఆ పార్టీ నేతలు లక్ష్యంగా దాడులకు పాల్పడుతోంది. సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలను ప్రయోగిస్తోంది. మరోవైపు, సీబీఐ దాడులకు భయపడేది లేదని ఆప్ నేతలు స్పష్టంచేస్తున్నారు. తాజాగా ఢిల్లీ ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి మనీశ్ సిసోడియా నివాసంలో శుక్రవారం సీబీఐ అధికారులు సోదాలు చేపట్టారు. మద్యం విధానంపై దాఖలైన కేసు విచారణలో భాగంగా ఈ తనిఖీలు చేస్తున్నారు. సిసోడియా నివాసంతో పాటు ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలోని 21 చోట్ల ఈ సోదాలు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. ఢిల్లీలో గతేడాది నవంబరులో కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన అబ్కారీ విధానంలో అనేక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. మద్యం విధానంలో నిబంధనల ఉల్లంఘన జరగడంతో పాటు విధానపరమైన లోపాలున్నట్లు ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సైతం నివేదిక ఇచ్చారు. టెండర్ల విధానంలో కొందరికి ఆయాచిత లబ్ధి చేకూరేలా నిర్ణయాలు తీసుకున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. దీంతో ఈ ఉల్లంఘనలపై దర్యాప్తు చేపట్టాలని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సిఫార్సు చేశారు. ఈ వ్యవహారంలో ఎక్సైజ్‌శాఖకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మనీశ్ సిసోడియా పాత్రనూ అందులో ప్రస్తావించారు. ఈ క్రమంలోనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన సీబీఐ...దర్యాప్తులో భాగంగా సోదాలు చేపట్టింది. సిసోడియా నివాసం, కార్యాలయంతో పాటు మాజీ ఎక్సైజ్ కమిషనర్ గోపీకృష్ణ తదితరుల ఇళ్లల్లోనూ తనిఖీలు జరిపింది.

సీబీఐకి స్వాగతం: సిసోడియా

సీబీఐ దాడుల విషయాన్ని మనీశ్ సిసోడియా ట్విటర్ వేదికగా ధ్రువీకరించారు. తన ఇంట్లో సీబీఐ అధికారులకు స్వాగతం పలికాం. దర్యాప్తునకు తమ వైపు నుంచి పూర్తి సహకారం అందిస్తాం. అప్పుడే నిజానిజాలు త్వరగా బయటకు వస్తాయి. అప్పటిదాకా తనపై ఎన్నికేసులు పెట్టినా ఏమీ జరగదు. ఉత్తమ విద్య కోసం తాను చేస్తోన్న కృషిని ఎవరూ ఆపలేరు. అయితే.. దేశం కోసం మంచి పనులు చేస్తోన్న వారిని ఇలా వేధించడం దురదృష్టకరం. అందుకే మన దేశం నంబర్ వన్‌గా మారలేకపోతోందని సిసోడియా మండిపడ్డారు. కొంతమంది కావాలనే ఢిల్లీలో విద్య, వైద్యశాఖలపై ఆరోపణలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. ఈ రంగాల్లో జరుగుతోన్న మంచిని ఆపాలనే ఉద్దేశంతోనే తమపై అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. అవన్నీ తప్పుడు ఆరోపణలేనని, నిజాలన్నీ కోర్టులోనే బయటకు వస్తాయన్నారు.

మంచిపనికి రివార్డ్ ఇది: కేజ్రీవాల్

సిసోడియా ఇంట్లో సీబీఐ సోదాలపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా మండిపడ్డారు. తాము చేస్తోన్న మంచి పనులకు కేంద్రం ఇస్తోన్న బహుమానం ఇదేనని దుయ్యబట్టారు. ఈరోజే ఢిల్లీ విద్యా నమూనాను అభినందిస్తూ అమెరికా దిగ్గజ వార్తాపత్రిక అయిన న్యూయార్క్ టైమ్స్‌లో మొదటిపేజీలో కథనం వచ్చిందని, మనీశ్ సిసోడియా ఫొటోను కూడా ప్రచురించారని, ఇదే రోజు ఆయన ఇంట్లో సీబీఐ సోదాలు జరుగుతున్నాయని, మంచి పనికి లభించిన ఫలితమిదని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

అయితే సీబీఐకి తాము స్వాగతం పలుకుతున్నామని, దర్యాప్తునకు సహకరిస్తామని చెప్పారు. గతంలోనూ తమ నేతలపై దాడులు జరిగాయని, అప్పుడు వారికి ఏమీ దొరకలేదని, ఇప్పుడు కూడా అదే జరుగుతుందని కేజ్రీవాల్ ట్విటర్‌లో ఎద్దేవా చేశారు. ఢిల్లీ వైద్యారోగ్య మంత్రి సత్యేంద్ర జైన్ అరెస్టయిన విషయం తెలిసిందే.

పెన్సిళ్లు, జామెట్రీ బాక్స్‌లే దొరుకుతాయి: రాఘవ్

సిసోడియా నివాసంపై సీబీఐ దాడికి సంబంధించి ఆప్ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. సిసోడియా ఇంట్లో కేవలం పుస్తకాలు, పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు మాత్రమే కనిపిస్తాయని ఆప్ నేత రాఘవ్ చద్దా ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు సుమారు వంద మందికి పైగా ఆప్ నేతలపై తప్పుడు కేసులు పెట్టారని, ప్రతి కేసులో ఒక్కొక్కరిగా తాము బయటపడ్డామని రాఘవ అన్నారు.

కార్యకర్తల ఆందోళన

మనీశ్ సిసోడియా నివాసంలో సీబీఐ దాడులకు నిరసనగా శుక్రవారం అనేకమంది ఆప్ మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పార్టీ మద్దతుదారులు సిసోడియా నివాసానికి సమీపంలోని మధుర రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఆందోళనకారులను అక్కడి నుంచి ఖాళీ చేయించి వసంత్‌కుంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు.

ఈడీ దర్యాప్తునకు రంగం సిద్ధం

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ కొత్త మద్యం విధానంపై ఈడీ దర్యాప్తునకు రంగం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా నివాసంతో సహా ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని 20కి పైగా చోట్ల సీబీఐ దాడుల ఫలితంగా సిసోడియాపై ఇసీఐఆర్ సంబంధిత చర్యను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో నేరాల ద్వారా వచ్చిన ఆదాయంలో ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులు సహా అనేక మంది లబ్ధిదారులుగా ఉన్నారని ఈడీ వర్గాలు వెల్లడించాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు సమాచార నివేదిక (ఈసీఐఆర్) అనేది పోలీసుల ఎఫ్‌ఐఆర్‌కి సమానం. అయితే ఇందులో ఏ నిందితుడిని వెల్లడించలేదని ఈడీ అధికారి తెలిపారు. ఇదిలావుండగా, గత ఏడాది నవంబరులో తీసుకువచ్చిన ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించడంలో, అమలు చేయడంలో జరిగిన అవకతవకలకు సంబంధించి తమ సోదాల తర్వాత సీబీఐ కూడా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. కేజ్రీవాల్ ప్రభుత్వ ఎక్సైజ్ విధానం-2021-22, నిబంధనల ఉల్లంఘనలు, విధానపరమైన లోపాలపై సీబీఐ విచారణకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సిఫారసు చేశారు. జీఎన్‌సీటీడీ చట్టం 1991, వ్యాపార నిబంధనల లావాదేవీలు (టీఓబీఆర్)-1993, ఢిల్లీ ఎక్సైజ్ చట్టం-2009, ఢిల్లీ ఎక్సైజ్ నిబంధనలు-2010 ప్రాథమిక ఉల్లంఘనలను చూపుతూ ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జులైలో దాఖలు చేసిన నివేదిక పై సీబీఐ విచారణకు సిఫార్సు చేసినట్లు వారు తెలిపారు. ఇది కాకుండా, టెండర్ తర్వాత 'మద్యం లైసెన్స్‌లకు అనుచిత ప్రయోజనాలను' అందించడానికి 'ఉద్దేశపూర్వక, స్థూల విధానపరమైన లోపాలు' కూడా ఉన్నాయని సీబీఐ తెలిపింది. ఇదిలాఉండగా, సిసోడియా తన వరుస ట్వీట్లలో సీబీఐని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య, విద్యా రంగంలో ఢిల్లీ ప్రభుత్వం చేసిన అద్భుతమైన పని కారణంగా ఈ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. అందుకే రెండు శాఖల మంత్రులను లక్ష్యంగా చేసుకుని వైద్యం, విద్యారంగంలో మంచి పనులు చేయకుండా మమ్మల్ని అడ్డుకుంటున్నారని, మా ఇద్దరిపై వచ్చిన ఆరోపణలు అబద్ధమని, కోర్టులో నిజం తేలుతుందని అన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల కోసం విస్తృత ప్రచారం

జేవీఎస్ఎన్ మూర్తి వెల్లడి

విశాలాంధ్ర-విశాఖ: సీపీఐ 27వ రాష్ట్ర మహాసభల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామని, ఇప్పటికే జిల్లావ్యాప్తంగా గోడ రాతలు, ప్రచార బ్యానర్లు ఏర్పాటు చేసి ఇంటింటా కరపత్రాలు పంపిణీతో ప్రచారం నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, మహాసభల నిర్వహణ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. మహాసభల ఆహ్వానసంఘం సమావేశం శుక్రవారం సాయంత్రం సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ 1974లో విశాఖలో సీపీఐ రాష్ట్ర మహాసభలు జరిగాయని, నాడు పోర్టు యూనియన్ ప్రముఖపాత్ర పోషించి మహాసభల జయప్రదానికి విశేష కృషి చేసిందని గుర్తుచేశారు. 26వ తేదీ మధ్యాహ్నం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి వీఎంఆర్‌డీఏ గురజాడ కళాక్షేత్రం వరకు భారీ ప్రజా ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.

విరివిగా విరాళాలు:

రాష్ట్ర మహాసభల నిర్వహణ కోసం విరివిగా విరాళాలు అందుతున్నాయి. చిట్టివలస జూట్ కార్మిక సంఘం, పార్టీ నుంచి లక్ష రూపాయలు, విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు.

సభా ప్రాంగణానికి ప్రముఖుల పేర్లు

బహిరంగసభ (గురజాడ కళా క్షేత్రానికి) ప్రాంగణానికి ప్రముఖ కార్మిక నాయకులు గురుదాస్ దాస్‌గుప్తా పేరును, మహాసభ ప్రాంగణానికి (వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణానికి) రైతుసంఘం నాయకులు కొల్లి నాగేశ్వరరావు పేరును, భోజనశాలకు మాజీ శాసనసభ్యులు వంక సత్యనారాయణ పేర్లు పెడుతున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజుతో పాటు పార్టీ, ప్రజాసంఘాలు, ఆహ్వానసంఘం నాయకులు పాల్గొన్నారు.

గాంధీనే చంపేశారు... నన్ను వదులుతారా?

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య తన భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొడుగులో పర్యటనకు వెళ్లిన సిద్ధరామయ్య కారుపై కొందరు గుడ్లు విసిరి, నల్ల జెండాలు చూపించి ఆందోళనకు దిగిన తర్వాతి రోజే ఆయనీ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఓ కార్యక్రమంలో సిద్ధరామయ్య మాట్లాడుతూ.. గాంధీనే చంపిన వారు తనను వదులుతారని తాను అనుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీని గాడ్సే కాల్చి చంపాడని, కానీ వారు గాంధీ ఫొటోను పూజిస్తారని విమర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు సిద్ధరామయ్య గురువారం కొడుగులో పర్యటించారు. అయితే, అక్కడాయనకు బీజేపీ కార్యకర్తల నుంచి చేదు అనుభవం ఎదురైంది. నల్లజెండాలు చూపిస్తూ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతేకాదు, కొందరు కార్యకర్తలు ఆయన కారుపై గుడ్లు కూడా విసిరినట్టు తెలుస్తోంది. అంతేకాదు, ఓ కార్యకర్త సిద్ధరామయ్యపైకి సావర్కర్ ఫొటోను విసిరాడు. వీరు తనను కూడా వదలరన్న సిద్ధరామయ్య వ్యాఖ్యలపై కర్ణాటక హోంమంత్రి అరగ జ్ఞానేంద్ర స్పందించారు. ఆందోళనను అనుమతిస్తామని, కానీ చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుంటామంటే మాత్రం సహించబోమని అన్నారు. సిద్ధరామయ్య వ్యాఖ్యలను విశ్వసించబోనన్న మంత్రి.. ఆయనకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ఆయన ఈ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఆయనపై ఎవరూ దాడిచేయరని, ఎవరూ హత్య చేయరన్నారు. సిద్ధ రామయ్యకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించినట్టు పోలీసులు కూడా తనకు చెప్పారని మంత్రి జ్ఞానేంద్ర తెలిపారు

కటారియాపై అరెస్ట్ వారెంట్

డెహ్రాడూన్: స్పైస్‌జెట్ విమానం సీట్లో పడుకుని సిగరెట్ కాల్చుతూ వీడియోలు పోస్టు చేసిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ బాబీ కటారియా గుర్తున్నాడా?. అతడిపై ఇప్పుడు తాజాగా నాన్ బెయిలబుల్ వారంట్ జారీ అయింది. రోడ్డు మధ్యలో కుర్చీలు వేసుకుని బహిరంగంగా మద్యం తాగిన కేసులో ఈ వారంట్ జారీ అయినట్టు పోలీసులు పేర్కొన్నారు. అతడిని అరెస్ట్ చేసేందుకు హర్యానాకు పోలీసు బృందాన్ని పంపినట్టు డెహ్రాడూన్ కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్ సింగ్ రావత్ తెలిపారు. రోడ్డు మధ్యలో మద్యం తాగుతున్న వీడియో వైరల్ అయిన తర్వాత అతడికి మూడు నోటీసులు పంపామని, అయినప్పటికీ ఆయన స్పందించలేదని ఆయన పేర్కొన్నారు. దీంతో నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్టు చెప్పారు. హర్యానాకు చెందిన బాబీ కటారియా గత వారం ఈ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశాడు. దీనిపై డెహ్రాడూన్ కంటోన్మెంట్ పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా, విమానం సీట్లో సిగరెట్ తాగిన వీడియోపై పౌరవిమానయానశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా విచారణకు ఆదేశించారు. జనవరి 20న ఢిల్లీ-దుబాయ్ విమానంలో ఈ ఘటన జరిగినట్టు స్పైస్‌జెట్ తెలిపింది. అలాగే, కటారియా పేరును 'నో ఫ్లైయింగ్' జోన్‌లో చేర్చినట్టు పేర్కొంది.

అది ప్రభుత్వ నిర్ణయమే...

న్యాయవ్యవస్థను నిందించొద్దు: భట్కర్

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో సామూహిక అత్యాచార కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న దోషులను జైలు నుంచి విడుదల చేయడంపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగైతే సామాన్యులకు న్యాయం ఎలా దక్కుతుందంటూ న్యాయవ్యవస్థపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బిల్కిస్ బానో కేసులో దోషులకు శిక్ష విధించిన న్యాయమూర్తి జస్టిస్ మృదులా భట్కర్ స్పందించారు. అత్యాచార దోషులను విడుదల చేయడం పూర్తిగా ప్రభుత్వ నిర్ణయమే అని, ఇందుకు న్యాయవ్యవస్థను నిందించొద్దని కోరారు. 'ఈ విషయంలో ప్రజలు న్యాయవ్యవస్థను ఎందుకు తప్పుబడుతున్నారో అర్థం కావట్లేదు. అది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం. ప్రజల హక్కులను పరిరక్షించేందుకు న్యాయవ్యవస్థ శాయశక్తులా ప్రయత్నిస్తుంటుంది. బిల్కిస్ బానో కేసులోనూ మేం అదే చేశాం. సెషన్స్ కోర్టుల నుంచి సుప్రీంకోర్టు వరకూ మేమంతా ప్రజలకు న్యాయం దక్కేందుకే పనిచేస్తాం. కానీ, ఈ రోజు మమ్మల్ని విమర్శించడం బాధ కలిగిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో మమ్మల్ని మేమే రక్షించుకోలేకపోతున్నాం" అని న్యాయమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. 2002లో బిల్కిస్ బానో కేసులో 11 మందికి జీవిత ఖైదు విధించిన డివిజన్ బెంచ్‌లో జస్టిస్ మృదుల భట్కర్ ఒకరు. ప్రస్తుతం ఆమె మహారాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యూనల్‌కు ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు.

బ్యాంకుల ప్రైవేటీకరణపై ఆర్బీఐ హెచ్చరిస్తోంది: కాంగ్రెస్

న్యూఢిల్లీ: బ్యాంకుల ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ తన వాదనకు మద్దతుగా భారతీయ రిజర్వు బ్యాంకు వెబ్‌సైట్‌లో ప్రచురితమైన ఓ వ్యాసాన్ని చూపించింది. బ్యాంకులను ప్రైవేటీకరించడానికి పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రయత్నాలపై ఈ వ్యాసం గట్టిగా హెచ్చరించిందని తెలిపింది. అయితే ఇది ఆ వ్యాసకర్తల అభిప్రాయమేనని ఆర్బీఐ పేర్కొంది. కాంగ్రెస్ ప్రస్తావించిన వ్యాసాన్ని స్నేహల్ ఎస్ హెర్వాడ్కర్, సోనాలీ గోయల్, రిషక బన్సల్ రాశారు. వీరు ఆర్బీఐ, ఆర్థిక, విధాన పరిశోధన శాఖ, బ్యాంకింగ్ రీసెర్చ్ డివిజన్‌కు చెందినవారు. ఈ వ్యాసంలో వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఆ వ్యాసకర్తలకు చెందినవి మాత్రమేనని ఆర్బీఐ పేర్కొంది. ఈ వ్యాసాన్ని తన అభిప్రాయంగా భావించరాదని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ఈ వ్యాసాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆయన శుక్రవారం ఇచ్చిన ట్వీట్‌లో, ఆర్బీఐ హెచ్చరిస్తోందని చెప్పారు. ప్రైవేటు బ్యాంకులు ఇప్పటికే 27 నుంచి 12కు తగ్గిపోయాయని తెలిపారు. ప్రభుత్వం బహుశా ఈ సంఖ్యను 1కి చేర్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఆర్బీఐ చెబుతున్న దానినిబట్టి ఇది విపత్తును ఆహ్వానించడం వంటిదేనన్నారు. అయితే మోదీ ప్రభుత్వం తన ఇష్టాయిష్టాలు, నమ్మకాలు, భ్రమలతో కార్యకలాపాలు నిర్వహిస్తుందని ఎద్దేవా చేశారు. పెద్ద నోట్ల రద్దు విషయంలో సైతం ఆర్బీఐ ఇచ్చిన సలహాను కేంద్ర ప్రభుత్వం వినలేదన్నారు.

మహిళలకే లైంగిక భాగస్వాములు ఎక్కువ

న్యూఢిల్లీ: దేశంలోని 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో.. పురుషుల కంటే మహిళలకే సగటున ఎక్కువ మంది లైంగిక భాగస్వాములు ఉన్నట్టు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే లెక్కల్లో తేలింది. రాజస్థాన్, హరియాణా, చండీగఢ్, జమ్ముకశ్మీర్, లఢఖ్, మధ్యప్రదేశ్, అసోం, కేరళ, లక్షద్వీప్, పుదుచ్చేరీ, తమిళనాడులోని మహిళలు ఈ విషయంలో పురుషులకంటే ముందున్నారు. ఇక రాజస్థాన్‌లో అత్యధికంగా ప్రతి మహిళకు సగటున 3.1 మంది లైంగిక భాగస్వాములుండగా.. పురుషుల విషయంలో ఈ సంఖ్య 1.8గా ఉంది. అయితే.. జీవిత భాగస్వామి లేదా సహజీవనం చేస్తున్న వ్యక్తితో కాక ఇతరులతో సెక్స్‌లో పాల్గొన్న వారిలో పురుషులే ఎక్కువగా ఉన్నట్టు ఈ సర్వేలో తేలింది. ఇలాంటి సంబంధాలున్న పురుషుల వాటా 4 శాతం కాగా.. మహిళల వాటా మాత్రం 0.5 శాతం. మొత్తం 1.1 లక్షల మంది మహిళలు, లక్ష మంది పురుషులు ఈ సర్వేలో పాల్గొన్నారు. సర్వేకు మునుపు సంవత్సర కాలాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ అధ్యయనం నిర్వహించారు. 2019-21 మధ్య జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5ని నిర్వహించారు. మొత్తం 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 707 జిల్లాల్లో ఈ సర్వే జరిగింది. దేశ ప్రజల ఆర్థిక సామాజిక నేపథ్యానికి సంబంధించి సమాచారాన్ని సర్వేలో సేకరించారు. ప్రజల అభ్యున్నతి కోసం పథకాల రూపకల్పనలో సర్వే సమాచారాన్ని ప్రభుత్వం వినియోగిస్తుంది.

లంకా గోవిందరాజులుకు కన్నీటి వీడ్కోలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పేదల పక్షపాతి, సీపీఐ సీనియర్ నాయకులు, నగర మాజీ మేయర్ లంకా గోవిందరాజులకు శుక్రవారం అశేష ప్రజానీకం కన్నీటి వీడ్కోలు పలికారు. గురువారం మధ్యాహ్నం విద్యాధరపురంలోని వారి కుమారుల ఇంటి వద్ద మృతి చెందిన గోవిందరాజులు అంతిమయాత్ర ఉదయం 11గంటలకు కార్మికపురంలోని వారి స్వగృహం నుంచి ప్రారంభం కాగా, పేద, మధ్య తరగతివర్గాలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గోవిందరాజులు తన జీవితాన్ని పేద ప్రజల సేవకే అంకితం చేశారనడానికి ఇదే నిదర్శనం. పూలతో అలంకరించిన వ్యాన్‌పై ఏర్పాటు చేసిన ఎత్తయిన వేదికపై ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. తొలుత గోవిందరాజులు భౌతికకాయం ఉంచిన పాడెను మహిళలు భుజాలపై ఎత్తుకుని అన్నదాన సమాజం రోడ్డులోని కరెంట్ ఆఫీస్ వరకు మోయడం విశేషం. తర్వాత ప్రారంభమైన అంతిమయాత్రలో వ్యానుకు ముందు రెడ్‌షర్టు వలంటీర్లు కవాతుగా నడవగా, పెద్దఎత్తున హాజరైన ప్రజానీకం వారిని అనుసరించారు. అంతిమయాత్ర అగ్రభాగాన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్, అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దోనేపూడి శంకర్, కృష్ణాజిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి తాతయ్య, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు నక్కా వీరభద్రరావు, లంకా దుర్గారావు, వివిధ డివిజన్ల పార్టీ శాఖా కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అంతిమ యాత్ర అన్నదాన సమాజం రోడ్డు, దుర్గ అగ్రహారం, లిక్కి పుల్లయ్య వీధి, జనతా పత్రిక కార్యాలయం, కొత్త వంతెన సెంటర్, సీతారామపురం జంక్షన్, ఏలూరు రోడ్డు మీదుగా విజయా టాకీస్ వద్ద గల సీపీఐ కార్యాలయం తమ్మారెడ్డి భవన్ వద్దకు చేరింది. అక్కడ కొంతసేపు నిలుపగా పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్ర తిరిగి ప్రారంభమై స్వర్ణప్యాలెస్, కొత్త బస్టాండ్ మీదుగా స్వర్గపురికి చేరింది. గోవిందరాజులు భౌతికకాయం చితికి ఆయన పెద్ద కుమారుడు లంకా నాగేశ్వరరావు నిప్పంటించి దహన సంస్కారం నిర్వహించారు. ఈసందర్భంగా గోవిందరాజులు సోదరుడు లంకా వెంకటేశ్వరరావు కుమారుడు సాంబశివరావు నేతృత్వంలో నిర్వహించిన కర్రసాము ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

ప్రముఖుల నివాళులు

అంతిమయాత్రకు ముందుగా శుక్రవారం ఉదయం అనేకమంది ప్రముఖులు, పార్టీ నేతలు లంకా గోవిందరాజులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఏఐకేఎస్ అధ్యక్షుడు రావుల వెంకయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు సీహెచ్ బాబురావు, నగర నాయకుడు దోనేపూడి కాశీనాథ్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు వి.గుర్నాథం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సి.నర్సింహారావు, ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దాలి నాయుడు, డీహెచ్‌పీఎస్ నాయకులు బుట్టి రాయప్ప, ప్రజానాట్యమండలి నాయకులు ఆర్.పిచ్చయ్య, నజీర్ తదితరులు గోవిందరాజులు భౌతికకాయంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

నిరాడంబరతకు నిలువుటద్దం

లంకా గోవిందరాజులు నగర కమ్యూనిస్టు సమితి కార్యదర్శిగా 15 సంవత్సరాలపాటు బాధ్యతలు నిర్వహించి అనంతరం నగర మేయర్‌గా పదవిని అలంకరించినప్పటికీ నిరాండంబర జీవితాన్ని గడిపారు. పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అహరహం శ్రమించేవారు. ఏనాడూ బేషజాలకు పోయేవాడు కాదు. మహిళా శక్తినే ఆయుధంగా మలచుకుని ఆయన ఆనేక పోరాటాలు నిర్వహించారు. కాల్వ గట్లపై పేద ప్రజల ఆవాసాలు తొలగించిన సమయంలో వారికి ప్రత్యామ్నాయ స్థలాలు ఇప్పించేందుకు అధికారులపై అలుపెరగని పోరాటం సాగించారు. ఈనాడు పాయకాపురంలో ఉన్న ఆవాసాలన్నీ కూడా గోవిందరాజులు తన కృషితో ఇప్పించినవే. ఆయన తన జీవితాన్ని సాదాసీదాగా గడిపిన ఆదర్శ కమ్యూనిస్టు. నేటి యువతరం కమ్యూనిస్టులకు ఆయన ఒక ప్రేరణ అనడం అతిశయోక్తి కాబోదు. ప్రజాసమస్యల విషయంలో, పార్టీలో ఆయన మార్క్సిజం దృక్పథంతో విశ్లేషించి లోతైన చర్చలు జరిపేవారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.